మా కలం.. మీ గళం..
# మన గళం
దిన పత్రిక
RNI : APTEL/ 2017/74310
పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 61 ఆదివారం 03 - 08 - 2025 పేజీలు: 8 వెల: 4

క్రీడాకారులు పతకాలతో తిరిగి రావాలి



3లో..

# పాతాళంలో దాక్కున్నా వదలం

- పాతాళ లోకంలో దాక్కున్నా ఉగ్రవాదులను వదలం
- అవసరమైతే భారత్ కాళభైరవుడిలా మారుతుందని స్పష్టీకరణ
- 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైందని వెల్లడి
- పహల్గామ్ దాడికి ప్రతీకారం తీర్చుకున్నామని వెల్లడి
- పాక్‌కు ప్రధాని మోదీ తీవ్ర హెచ్చరిక



మన గళం, న్యూఢిల్లీ : భారత్‌పై దాడి చేసే ఉగ్రవాదులు పాతాళ లోకంలో దాక్కున్నా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని ప్రధాని నరేంద్ర మోదీ పాకిస్థాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉగ్రవాదాన్ని, అన్యాయాన్ని అణచివేసేందుకు అవసరమైతే భారత్ 'కాళభైరవుడి' రూపం దాలుస్తుందని స్పష్టం చేశారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ప్రపంచం భారతదేశ రుద్ర రూపాన్ని చూసిందని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం తన పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాసిలో ఏర్పాటు చేసిన భారీ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిని గుర్తుచేసుకుంటూ, ఆ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రతీకారం తీర్చుకుంటానని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నానని తెలిపారు. మహాదేవుని ఆశీస్సులతో 'ఆపరేషన్ సిందూర్' విజయం సాధించిందని, ఈ విజయాన్ని కాశీ విశ్వనాథుని పాదాల చెంత సమర్పిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా విపక్షాలపై ప్రధాని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

2 లో..

## పదో తరగతి, ఇంటర్ అర్హతతో
# రైల్వేలో 3115 ఉద్యోగాలు




మన గళం, న్యూఢిల్లీ : ఈస్టర్న్ రైల్వే కోల్‌కతా.. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 3,115 అప్రెంటీస్ ఖాళీలను భర్తీ చేయనుంది. ఫిట్టర్, వెల్డర్, మెకానికల్, మెషినిస్ట్, కార్పెంటర్, పెయింటర్, లైన్‌మెన్, వైర్‌మెన్, ఆర్ఈఎఫ్ ఏసీ మెకానిక్, ఎలక్ట్రీషియన్.. విభాగాల్లో ఈ ఖాళీలను భర్తీ చేయనుంది. అర్హత కలిగిన అభ్యర్థులు ఆగస్టు 14, 2025వ తేదీ ఉదయం 11 గంటల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

హౌరా డివిజన్ పోస్టుల సంఖ్య: 659, లిలువా వర్క్‌షాప్ పోస్టుల సంఖ్య: 612, సీల్డా డివిజన్ పోస్టుల సంఖ్య: 440,. కాంచ్రపార వర్క్‌షాప్ పోస్టుల సంఖ్య: 187, మాల్డా డివిజన్ పోస్టుల సంఖ్య: 138, అసన్‌సోల్ డివిజన్ పోస్టుల సంఖ్య: 412, జమలాపూన్ వర్క్‌షాప్ పోస్టుల సంఖ్య: 667, పోస్టులను అనుసరించి పదో తరగతితోపాటు సంబంధిత విభాగంలో ఇంటర్, ఐటీఐలో ఉత్తీర్ణత

2 లో..



## ఇచ్చిన ప్రతి హామీని
# నెరవేరుస్తాం

- రైతుల ఖాతాల్లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద 20వ విడత విడుదల

మన గళం, న్యూఢిల్లీ : ఆపరేషన్ సిందూర్ తర్వాత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలిసారిగా తన పార్లమెంటరీ నియోజకవర్గం వారణాసిలో పర్యటించారు. ఈ సందర్భంగా వారణాసిలోని సేవాపురిలోని బనౌలి గ్రామంలో రూ.2,183.45 కోట్ల విలువైన 52 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. పలు పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే, రైతుల ఖాతాల్లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద 20వ విడతను విడుదల చేశారు. బహిరంగ సభలో ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆపరేషన్ సింధూరం సైనికుల పరాక్రమానికి నిదర్శనమన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి రూపంలో దేశంలోని 10 కోట్ల మంది రైతు సోదరసోదరీమణుల ఖాతాలకు 21 వేల కోట్ల రూపాయలు జమ చేశామన్నారు. కాశీ నుండి డబ్బు వెళ్ళినప్పుడు, అది స్వయంచాలకంగా మహాదేవుడి ప్రసాదంగా మారుతుంది" అని మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారి కాశీకి వచ్చానని ప్రధాని మోదీ అన్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రవాద దాడి జరిగినప్పుడు 26 మంది అమాయకులను అతి దారుణంగా చంపారన్నారు. ఈ

2 లో..



## గత ఐదేళ్లు ఏపీ ప్రజలు
# సైకో పాలన చూశారు

- గత పాలకులు పెన్షన్లు ఇవ్వకుండా ఎగ్గొట్టారు
- బూతుల పంచాంగం నేర్చుకుంటున్నారు
- ఇంటికో వ్యాపారవేత్త
- ప్రకృతి సేద్యంతోనే ఆరోగ్యం
- నదులు అనుసంధానం చేస్తాం

మన గళం, ప్రకాశం జిల్లా: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత వైసీపీ పాలనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పాలకులు పెన్షన్లు ఇవ్వకుండా ఎగ్గొట్టారని, ఎన్నికల ముందు రాక్షస పాలన చూశామని వ్యాఖ్యానించారు. వైసీపీ పాలనలో ఇబ్బందిపడుతూ పెన్షన్లు పెంచారని అయితే కూటమి పాలనలో ఒక్కసారే పెన్షన్లు పెంచామని ప్రజలకు వివరించారు. ఐదేళ్లు ఏపీ ప్రజలు సైకో పాలన చూశారని సీఎం చంద్రబాబు కామెంట్స్ చేశారు. గత పాలనలో అందరినీ ఇబ్బందిపెట్టారని.. అందుకే, వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదని పవన్ పొత్తు కోసం ముందుకువచ్చారని, రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీతో పొత్తు పెట్టుకున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతి ఆడబిడ్డలపై జగన్ తన దినపత్రికలో దారుణంగా చిత్రీకరించారని చంద్రబాబు ఫైర్ అయ్యారు. జగన్ పొదిలి వచ్చిన సమయంలో ఆడబిడ్డలు క్షమాపణ చెప్పమని అడిగారని అయితే, వారిపై దౌర్జన్యం చేశారని చంద్రబాబు తెలిపారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వ్యక్తిగత జీవితాన్ని ఒక మాజీ ఎమ్మెల్యే విమర్శించాడని.. అతను పశువువా లేకా మనిషా అర్థం కావడం లేదని చంద్రబాబు సీరియస్ కామెంట్స్ చేశారు. నేనైతే మరోసారి అలాంటివి జరగకుండా మందలించేవాడిని అని కానీ జగన్ ఆ మాజీ ఎమ్మెల్యే ఇంటికి వెళ్ళి పరామర్శించాడని అన్నారు. అవసరమైతే ఇళ్లల్లోకి వెళ్లి టీడీపీ వాళ్ళని లేపేస్తామని జగన్ అన్నాడని, నేను ఒకసారి ఏమారితే నారాసుర రక్త

2 లో..



## జగన్‌పై తీవ్రంగా మండిపడిన
# హోంమంత్రి

- జగన్‌కు కేజీకి, టన్నుకు తేడా తెలియదని ఎద్దేవా

మన గళం, అమరావతి : మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి అనిత తీవ్రంగా విమర్శలు గుప్పించారు. పొగాకు రైతుల వద్దకు వెళ్ళిన జగన్మోహన్ రెడ్డి కేజీకి, టన్నుకు తేడా తెలియకుండా మాట్లాడుతున్నారని ఆమె దుయ్యబట్టారు. మామిడి రైతుల వద్దకు వెళ్లి మామిడి కాయలు తొక్కించిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. శనివారం గజపతి

2 లో..

## అమరావతిలో బసవతారకం ఆసుపత్రికి
# త్వరలో భూమిపూజ



మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఈ నెల 13న బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమిపూజ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను బాలకృష్ణ, ఆయన సన్నిహితులు గాంధీ, సిద్ధాంతి నాగమల్లేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ ప్రణాళికలను సీఆర్డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్ బాలకృష్ణకు వివరించారు. మొత్తం 21 ఎకరాల విస్తీర్ణంలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తున్నట్లు బాలకృష్ణ వెల్లడించారు.

2 లో..

# ఇవే జీవితాన్ని అర్థవంతం చేసే క్షణాలు

- మంత్రిత్వ బాధ్యతల నడుమ ఓ తండ్రి ప్రేమ..
- ఒక్కరోజు సెలవు తీసుకున్న నారా లోకేష్



మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ లో అత్యంత బిజీ నేతల్లో ఒకరైన ఐటీ, హెచ్‌ఆర్డీ మంత్రి నారా లోకేష్, ఈరోజు శనివారం(ఆగస్టు 02) తన కొడుకు దేవాన్ష్ స్కూల్‌లో జరిగిన పేరెంట్ టీచర్ మీటింగ్‌కి హాజరయ్యారు. సాధారణంగా రాష్ట్రంలోని పెట్టుబడుల ఆకర్షణతోపాటు రాష్ట్రంలో కీలక మంత్రిగా, అంతకంటే ఎక్కువగా ముఖ్యమంత్రి కుమారుడిగా నిరంతరం అనేక సమావేశాలు, అధికార పర్యటనలతో నిత్యం తీరిక లేకుండా గడిపుతున్నారు లోకేష్. అయితే ఈసారి మాత్రం తన కొడుకు పాఠశాలలో జరిగే కార్యక్రమానికి ప్రత్యేకంగా ఒక రోజు సెలవు తీసుకున్నా.. అంటూ చేసిన ట్వీట్ అందరిని ఆకట్టుకుంది. ఇది కేవలం ఒక సాధారణ వార్త కాదు. ఓ మంత్రి సెలవు తీసుకున్న వార్త.. ఓ తండ్రి తన కొడుకు పట్ల

2 లో..

# పాతాళంలో దాక్కున్నా వదలం

“‘ఆపరేషన్ సిందూర్’ విజయాన్ని దేశంలోని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేయడం చూసి కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు కన్నీళ్లు పెట్టుకుంటున్నాయి. మన సైనికుల విజయాన్ని వారు ఓర్వలేకపోతున్నారు” అని ఆరోపించారు. ఉగ్రవాదులను ఏరివేయడానికి ఫలానా రోజు ఎందుకు ఎంచుకున్నారని ప్రశ్నించడం మన సైన్యాన్ని, అమరవీరులను అవమానించడమేనని మోదీ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో ‘మేడ్ ఇన్ ఇండియా’ ఆయుధాల శక్తిని ప్రపంచం చూసిందని మోదీ అన్నారు. ముఖ్యంగా బ్రహ్మోస్ క్షిపణుల కారణంగా పాకిస్థాన్ నిద్రలేని రాత్రులు గడుపుతోందని తెలిపారు. త్వరలో ఈ క్షిపణులను ఉత్తరప్రదేశ్‌లోనే తయారు చేయనున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తులో పాకిస్థాన్ మరోసారి దుస్సాహసానికి పాల్పడితే, యూపీలో తయారైన క్షిపణులే ఉగ్ర స్థావరాలకు సమాధానం చెబుతాయని హెచ్చరించారు. ఇది కొత్త భారత్ అని, మహాదేవుణ్ణి పూజించే ఈ దేశం, అవసరమైనప్పుడు కాళభైరవుడిగా మారడానికి వెనుకాడదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం

ఘటనతో నా హృదయం బాధతో నిండిపోయిందన్నారు. అప్పుడు బాధిత కుటుంబాలన్నీ ఈ దుఃఖాన్ని భరించే ధైర్యాన్ని ఇవ్వాలని కాశీవిశ్వనాథ్‌ను ప్రార్థిస్తున్నానన్నారు. నా బిడ్డల సిందూర్‌కు ప్రతీకారం తీర్చుకుంటానని, చేసిన వాగ్దానం నెరవేరింది. మహాదేవ్ ఆశీర్వాదంతోనే ఇది సాధ్యమైంది.” అని ప్రధాని తెలిపారు.

దురదృష్టవశాత్తు ఆపరేషన్ సిందూర్ విజయం మన దేశంలోని కొంతమందికి కడుపు నొప్పిని కలిగిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. భారతదేశం ఉగ్రవాదుల స్థావరాలను నాశనం చేసిందనే వాస్తవాన్ని ఈ కాంగ్రెస్ పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆపరేషన్ సిందూర్‌ను కాంగ్రెస్ తమాషాగా భావిస్తోంది. వాస్తవం ఏమిటంటే కాంగ్రెస్ ఉగ్రవాదుల పరిస్థితిని చూసి ఏడుస్తోంది. సిందూర్ ఎప్పుడైనా తమాషా కాగలదా? ఎవరైనా సిందూర్‌ను తమాషా అని పిలవగలరా? మనం ఉగ్రవాదులను చంపడానికి వేచి ఉండాలా? ఉగ్రవాదులను చంపడానికి పార్టీలను పిలవాలా? అని ప్రధాని మోదీ ప్రశ్నించారు. మహదేవుడు విశ్వనాథుడి ఆశీస్సులతో కాశీలో నిరంతరాయంగా అభివృద్ధి ప్రవాహం గంగమ్మతో పాటు ముందుకు సాగుతోందని ప్రధాని మోదీ అన్నారు. గత ప్రభుత్వాలు రైతుల పేరుతో చేసిన ప్రకటనలలో ఒక్కటి కూడా నెరవేరలేదన్నారు. రైతుల కోసం మేము చేసే ఏ ప్రకటనలనైనా నెరవేరుస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. 2019లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ప్రారంభించినప్పుడు, కాంగ్రెస్, ఎస్పీ వంటి అభివృద్ధి వ్యతిరేక పార్టీలు ఇది ఎన్నికల ప్రకటన అని అన్ని రకాల పుకార్లను వ్యాప్తి చేశాయి. నేటికీ ఈ నిరాశావాద వ్యక్తులు అభివృద్ధికి వ్యతిరేకంగా నిరాధారమైన ప్రకటనలు చేస్తున్నారన్నారు.

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిలో ఒక్క విడత కూడా మిస్ కాలేదని ప్రధాని అన్నారు. ఇప్పటి వరకు రూ. 90 వేల కోట్లు ఉత్తర ప్రదేశ్‌కు పంపగా, రూ. 900 కోట్లు కాశీ రైతులకు అందాయన్నారు. మొత్తం రూ. 3.75 లక్షల కోట్లు రైతుల ఖాతాలో జమ అయ్యాయని ప్రధాని మోదీ తెలిపారు. ఎటువంటి కమిషన్ లేదా మోసం లేకుండా రైతుల ఖాతాకు రూ. 900 కోట్లు బదిలీ చేసిన ఎంపీని మీరు ఎన్నుకున్నారు.యు మీకు శాశ్వత వ్యవస్థ లభించిందని ప్రధాని మోదీ అన్నారు. ఒక వ్యక్తి ఎంత వెనుకబడి ఉంటే అంత ఎక్కువ సహాయం లభిస్తుందనేది మా అభివృద్ధి నినాదమని ఆయన అన్నారు. మేము రూ. 21 వేల కోట్ల విలువైన ప్రధాన మంత్రి ధన్ ధాన్య యోజనను ప్రారంభించబోతున్నామని ప్రధాని మోదీ తెలిపారు. ఇప్పటివరకు, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద రూ. 1.75 లక్షల కోట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే పంటల మద్దతు ధరలో కూడా రికార్డు స్థాయిలో పెరుగుదల నమోదు చేసుకుందన్నారు. అలాగే పంటల మద్దతు ధరలో కూడా రికార్డు స్థాయిలో పెరుగుదల నమోదు చేసుకుందన్నారు.

# పదో తరగతి, ఇంటర్ అర్హతతో రైల్వేలో 3115 ఉద్యోగాలు




సాధించి ఉండాలి. అభ్యర్థుల వయోపరిమితి తప్పనిసరిగా 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ ద్వారా ఆగస్టు 14, 2025వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. సెప్టెంబర్ 13, 2025వ తేదీ రాత్రి 11.59 గంటలకు ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణకు తుది గడువు ముగుస్తుంది. దరఖాస్తు సమయంలో రిజిస్ట్రేషన్ ఫీజు కింద జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు తప్పనిసరిగా రూ.100 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఎలాంటి ఫీజు లేదు. ఎలాంటి రాత పరీక్ష లేకుండానే విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ఇతర వివరాలు ఈ కింది అధికారిక నోటిఫికేషన్‌లో చెక్ చేసుకోండి.

# జగన్‌పై తీవ్రంగా మండిపడిన హోంమంత్రి



నగరం వ్యవసాయ మార్కెట్ యార్డులో ‘అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్’ తొలి విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతుల విషయంలో రాజకీయం చేయరాదని హితవు పలికారు. రాజకీయం చేసేందుకు వైసీపీ నాయకులు వ్యవసాయాన్ని అడ్డుపెట్టుకుంటున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం రైతు కుటుంబాలకు మేలు చేసే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తుంటే ఉద్దేశపూర్వకంగా అడ్డు తగులుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు వ్యవసాయం అంటే ఎంతో ఇష్టమని, రీసర్వేలో రైతుల ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులు సాంకేతికతను వినియోగించుకోవాలని, ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు.

# గత ఐదేళ్లు ఏపీ ప్రజలు సైకో పాలన చూశారు

చరిత్ర అని జగన్ తన పత్రికలో రాశారని చంద్రబాబు కామెంట్స్ చేశారు.

**- బూతుల పంచాంగం నేర్చుకుంటున్నారు**

గుంటూరులో జగన్ కారు కింద కార్యకర్తలు పడితే చికిత్స చేయకుండా పక్కన పడేశారన్నారు. జగన్‌ని చూసి వారి నాయకులు, కార్యకర్తలు గొడ్డలి వేట్లు, బూతుల పంచాంగం, రప్పారప్పా అంటూ నేర్చుకుంటున్నారని చంద్రబాబు అన్నారు. జగన్ లేపేస్తే చూస్తూ ఊరుకోమని ఇక్కడ ఉండేది సీబీఎన్ అని చంద్రబాబు హెచ్చరించారు. గతంలో తీవ్ర వాదులు, ముఠా నాయకులపై పోరాడానని, ఇప్పుడు ఇలాంటి నేరస్తులు రాజకీయ ముసుగులో వస్తున్నారని.. ఆ ముసుగులు తొలగించాల్సిన అవసరం ఉందని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

**- ఇంటికో వ్యాపారవేత్త**

ప్రకాశం జిల్లాలో సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన అన్నదాత సుఖీభవ పథకానికి దర్శి నియోజకవర్గం తూర్పువీరాయపాలెం గ్రామం నుంచి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటికి ఒక వ్యాపారవేత్తని తయారు చేయాలని ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఇంటికొక సాఫ్ట్‌వేర్‌ని తయారు చేయాలని ఆలోచన చేశామని, ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా సాఫ్ట్‌వేర్ మనవాళ్లే ఉన్నారన్నారు.

**- వాట్సాప్ గవర్నెన్స్**

అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పెడతామని కీలక వ్యాఖ్యలు చేశారు. విశాఖ, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, అనంతపురం కేంద్రంగా రీజనల్ కేంద్రాలు పెడతామని, ప్రతి ఒక్కరినీ ప్రోత్సహిస్తామని తెలిపారు. ఏ సర్టిఫికెట్ కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వాట్సాప్ గవర్నెన్స్ అందుబాటులోకి తెచ్చామన్నారు.

**- ప్రకృతి సేద్యంతోనే ఆరోగ్యం**

వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ తీసుకువచ్చినట్లు చెప్పిన సీఎం చంద్రబాబు రైతులు ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. పంటలకు ఎరువులు ఎక్కువ వేయడం వల్ల క్యాన్సర్ బారిన పడుతున్నారని కాబట్టి, ప్రకృతి సేద్యమే ఆరోగ్యానికి మంచిదని వివరించారు. రైతు కూలీలు చిక్కడం లేదని వ్యవసాయంలో టెక్నాలజీని తీసుకొచ్చామన్నారు. అమెరికా పెంచిన టారిఫ్ వలన ఆక్వా రైతులకు ఇబ్బందని, దీనిపై ఆక్వా రైతులతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని భరోసా కల్పించారు.

**- నదులు అనుసంధానం చేస్తాం**

రాష్ట్రంలో 1000 టీఎంసీల నీటితో రిజర్వాయర్లు కళకళలాడుతున్నాయని, రాష్ట్రంలో నీటి కొరత లేకుండా చేయడానికి నదులు అనుసంధానం చేస్తామని అన్నారు. గత ప్రభుత్వంలో గుండ్లకమ్మ గేట్లు కూడా రిపేరు చేయలేదని, తాము గుండ్లకమ్మ గేట్లు పెట్టడంతో పాటు నీళ్లు నిల్వ చేశామని తెలిపారు. 1995-96లో వెలుగొండ ప్రాజెక్ట్ తానే ప్రారంభించానని, వెలుగొండ పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వానిదని ఆయన స్పష్టం చేశారు. అన్నం తిన్నారని గుర్తు చేశారు. గతంలో డబ్బున్న వాళ్ళ ఇళ్లల్లోనే బిఎస్ఎన్ఎల్ ఫోన్లు ఉండేవని, కానీ ఇప్పుడు అందరికీ చేతుల్లోకి సెల్‌ఫోన్లు వచ్చాయని తెలిపారు. 2047కి భారతదేశంలో నెంబర్ వన్ రాష్ట్రానికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్‌ని తయారు చెయ్యాలని సీఎం చంద్రబాబు అన్నారు.



# ఇవే జీవితాన్ని అర్థవంతం చేసే క్షణాలు

చూపిన అనురాగానికి గుర్తుగా నిలిచే వార్త. తన అధికారిక ట్విట్టర్‌లో లోకేష్ ఇలా పోస్ట్ చేశారు. “ఈరోజు దేవాన్ష్‌కి స్కూల్‌లో పేరెంట్ టీచర్ మీటింగ్ ఉంది. ఆ సందర్భం కోసం సెలవు తీసుకున్నా. పబ్లిక్ లైఫ్ ఎప్పుడూ పరుగుల్లో ఉంటుంది కదా.. అందుకే ఇలాంటి క్షణాలు మరింత విలువైనవిగా అనిపిస్తాయి. దేవాన్ష్ ప్రపంచం, అతని కథలు, నవ్వు అన్నీ చూసి ఓ తండ్రిగా గర్వంగా ఉంది. లోకేష్ ప్రస్తుతం రాష్ట్ర ఐటీ, హ్యూమన్ రిసోర్సెస్ అభివృద్ధి శాఖల మంత్రిగా ఉన్నప్పటికీ.. పెట్టుబడులు, పారిశ్రామికవేత్తలతో సమావేశాలు, విదేశీ పర్యటనలు వంటి అంశాల్లో కూడా ముఖ్యమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి కుమారుడు కూడా అయిన నారా లోకేష్, తన కుమారుడు దేవాన్ష్‌కి సంబంధించిన అంశాల్లో ఇస్తున్న ప్రాధాన్యత అందరిలో ఆసక్తిని కలిగించింది.

# అమరావతిలో బసవతారకం ఆసుపత్రికి త్వరలో భూమిపూజ



మూడు దశల్లో ఆసుపత్రి నిర్మాణం ఉంటుందని ఆయన తెలిపారు.

**- జాతీయ అవార్డు రావడంపై సంతోషం**

మహిళా సాధికారత ఆధారంగా తీసిన భగవంత్ కేసరి చిత్రానికి జాతీయ అవార్డు రావడంపై బాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఇకపై తాను తీయబోయే సినిమాలలో సమాజానికి సంబంధించిన మంచి సందేశాలు ఉంటాయని తెలిపారు. హిందూపురం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. పరిశ్రమలు, అంతర్రాష్ట్ర రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

# ఏపీ మెగా డీఎస్సీ ఫైనల్ ఆన్సర్ కీ విడుదల

మన గళం, అమరావతి : కూటమి సర్కార్ ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన మెగా డీఎస్సీ ఆన్‌లైన్ రాత పరీక్షలు గత నెలలో ముగిసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే అన్ని సబ్జెక్టుల ప్రాథమిక ఆన్సర్ కీలను కూడా విద్యాశాఖ విడుదల చేసింది. వీటిపై అభ్యంతరాలను కూడా స్వీకరించింది. తాజాగా విద్యాశాఖ మరో కీలక అప్‌డేట్ జారీ చేసింది. ఈ పరీక్షలకు సంబంధించిన ఫైనల్ ఆన్సర్ కీ విడుదల చేసింది. ఈ మేరకు డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ప్రకటన విడుదల చేశారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో తమ వివరాలతో లాగిన్ చేసి తుది ఆన్సర్ కీలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. త్వరలోనే ఫలితాలను కూడా వెల్లడిస్తామని విద్యాశాఖ పేర్కొంది. తుది కీ విడుదల చేసిన 7 రోజుల్లో డీఎస్సీ ఫలితాలు ప్రకటిస్తామని అధికారిక నోటిఫికేషన్‌లో పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ మేరకు వచ్చే వారం రోజుల్లోనే మెగా డీఎస్సీ ఫలితాలు వెల్లడికానున్నాయి. కాగా మొత్తం 16,347 ఉద్యోగాల భర్తీకి జూన్ 6 నుంచి జులై 2 వరకు విద్యాశాఖ ఆన్‌లైన్ రాత పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. అంతా అనుకున్నట్లు జరిగితే ఎంపికైన అభ్యర్థులకు ఆగస్టు 15 నాటికి







నియామక పత్రాలు అందజేస్తామని ఇప్పటికే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ శాఖలో ఇటీవల 691 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్స్ ఉద్యోగాల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవగా ఆగస్టు 5వ తేదీతో దరఖాస్తుల గడువు ముగియనుంది. ఈ పోస్టులకు రాత పరీక్ష సెప్టెంబర్ 7వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో ఆఫ్‌లైన్ విధానంలో పెన్ను, పేపర్ పద్ధతిలో జరనుంది. ఇదే శాఖకు చెందిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి కూడా తాజాగా నోటిఫికేషన్ విడుదలైంది. పోస్టులకు త్వరలోనే ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ముగియనుంది.

# నోడల్ అధికారుల నియామకం




- 52 వార్డులకు 15 మంది పర్యవేక్షక అధికారులు
- ప్రతిరోజూ వార్డులను సందర్శించి నివేదికలు ఇవ్వాలి
- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్ పి.విశ్వనాథ్

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలో పరిపాలన సౌలభ్యంలో భాగంగా పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనులు, ఆక్రమణలు తొలగింపు, సి అండ్ డి వేస్ట్ మేనేజ్మెంట్, తదితర కార్యక్రమాల పర్యవేక్షణకు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ప్రత్యేక అధికారులను నియమించారు. ఒక్కొక్క అధికారికి కొన్ని వార్డులు కేటాయించి, వాటికి నోడల్ అధికారిగా వ్యవహరించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతిరోజు ఉదయం 7:30 నుండి 9 గంటల వరకు శానిటేషన్, ప్లానింగ్, అమినిటీస్ కార్యదర్శులతో కలిసి కేటాయించిన వార్డులను సందర్శించాలని, సాయంత్రం 5 లోపు ఆయా వార్డుల్లో అభివృద్ధి పనుల పురోగతి, కార్యక్రమాల అమలు స్థితిగతులను నివేదికలు సమర్పించాలని కమిషనర్ పేర్కొన్నారు. కె.ఎం.డి.జునైద్ (రెవెన్యూ అధికారి) 1, 2, 3, 52 వార్డులకు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. అదేవిధంగా జి.మనోహర్ రెడ్డి (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) - 4, 5, 6, 7 వార్డులకు, యస్.అంజాద్ బాషా (టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్) - 17, 18 వార్డులకు, డీ.క్రిష్ణలత (డీఈఈ) - 8, 9, 10, 11 వార్డులకు, కె.జనార్ధన్ (ఏఈ) - 12, 13, 46, 47 వార్డులకు, జి.గిరిరాజు (డీఈఈ) - 14, 15, 16 వార్డులకు, టి.వెంకటేశ్వర్లు (సీనియర్ ఎంటమోలాజిస్ట్) - 42, 43, 44, 45 వార్డులకు, సి.వి.ఆర్. వైష్ణవి (ఏఈ) 48,49,50,51 వార్డులకు, గంగాధర్ (డీఈఈ) - 22, 23, 24, 25 వార్డులకు, సి.నరేష్ కుమార్ (డీఈఈ) - 19, 20, 21 వార్డులకు, ఇ.ప్రవీణ్ కుమార్ రెడ్డి (ఏఈ) - 26, 27 29, 30, 31 వార్డులకు, డాక్టర్ బి.మల్లన్న (వెటర్నరీ సర్జన్) - 28, 32 వార్డులకు, ఆర్.భాను ప్రతాప్ (ఏఈ) - 33, 34, 35 వార్డులకు, కె.విజయలక్ష్మి (హార్టికల్చర్ ఏడీ) - 36, 37 41 వార్డులకు, టి.అబ్దుల్ వాజిద్ (ఇంచార్జీ రెవెన్యూ అధికారి) - 38, 39, 40 వార్డులకు నోడల్ అధికారులకు వ్యవహరిస్తారని కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# స్మార్ట్ మీటర్లు ఏర్పాటును వ్యతిరేకించాలి




మనగళం, కర్నూలు సిటీ : ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లు అమర్చి ప్రజలపై భారం మోపేందుకు కుట్రలు పన్నుతున్నాయని, ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి .రాముడు పిలుపునిచ్చారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం ప్రజా వేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ కార్యక్రమం సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు ఎం .వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు పెడుతుంటే పగలగొట్టండి అని పిలుపునిచ్చిన నారాలోకేష్ అధికారంలోకి రాగానే మాట మార్చి మడమతిప్పి ప్రజల ఇళ్లకు దౌర్జన్యంగా స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని విమర్శించారు. మా ఇంట్లో స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని ఆగస్టు 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల ఎదుట జరుగు ధర్నాలో ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు లారీ హమాలియూనియన్ కార్యదర్శి బిసన్న, నాయకులు బి. రామకృష్ణ. మధు. సి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులు పతకాలతో తిరిగి రావాలి



మనగళం, కర్నూలు సిటీ : పల్నాడు జిల్లాలో జరగబోయే 19 వ రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ పోటీలలో జిల్లా క్రీడాకారులు విజేతలుగా తిరిగి రావాలని జిల్లా ఒలంపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి అవినాష్ శెట్టి ఆకాంక్షించారు. శనివారం కర్నూల్ రైల్వే స్టేషన్ నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లే జిల్లా క్రీడాకారులకు ఆయన వీడుకోలు పలికారు. అవినాష్ శెట్టి మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో రాష్ట్ర స్థాయి పోటీల్లో పథకాలలో లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. జిల్లా ఫ్లోర్ బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు మాట్లాడుతూ ప్రతిభ చూపి పతకాలు సాధిస్తే నజరానా అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శేషు, వెంకటలక్ష్మి ,మాధవి, భాగ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి

మనగళం, కర్నూలు : రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి తెలిపారు. పాణ్యం మార్కెట్ యార్డ్ లో శనివారం నిర్వహించిన అన్నదాత-సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు ప్రభుత్వం తరఫున నగదు అందజేస్తున్నామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నిక ముందు ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు మేలు జరుగుతుంటే ఓర్వలేక వైసీపీ నాయకులు అసత్యారోపణలు చేస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను అన్నింటినీ అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమం లో ప్రభుత్వ అధికారులు,కూటమి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలపై విద్యుత్ భారం మోపొద్దు

మనగళం, కర్నూలు సిటీ : ఇండస్ట్రీయల్ ఎస్టేట్ హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం కే గోవిందు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ న్యూసిటీ నగర కార్యదర్శి సీహెచ్ సాయిబాబా మాట్లాడుతూ కూటిమి సర్కార్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగుల గొట్టండంటూ స్వయానా లోకేష్ పిలుపునిచ్చిన విషయాన్ని అప్పుడే మరిపోయారన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయకుండా ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపేందుకు కూటమి సర్కార్ కుట్రలు పన్నుతోందని, ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో నాయకులు కే మహేష్, రామాంజీ, మారెన్న, అశోక్, మధు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ కాదు..అన్నదాత దుఃఖీభవ

- కాంగ్రెస్ నంద్యాల పార్లమెంటు జిల్లా డీసీసీ అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్



మనగళం, కర్నూలు సిటీ : సీఎం చంద్రబాబు మాటలకు చేతలకు ఏ మాత్రం పొంతన లేదని, కూటమి సర్కార్ ప్రతిష్టాత్మకంగా చెప్పుకుంటున్న అన్నదాత సుఖీభవ పథకం.. అన్నదాత దుఃఖీభవగా మారిందని కాంగ్రెస్ నంద్యాల పార్లమెంటు జిల్లా డీసీసీ అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్ ఎద్దేవా చేశారు. శనివారం దామోదర్ సంజీవయ్య భవనంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీల అర్హులు అందరికి కాదు..కొందరికే అని విమర్శించారు. రాష్ట్రంలో 76.07 లక్షల మంది రైతులుంటే.. కూటమి ప్రభుత్వం ఎంపిక చేసింది కేవలం 47 లక్షల మంది రైతులనేనని, కుంటి సాకు చూపుతూ 30 లక్షల మంది రైతులకు... సీఎం టోకరా పెట్టారని ధ్వజమెత్తారు. . ఇప్పటికే గ్యాస్ సిలిండర్లు సగం మందికే ఇస్తూ, తల్లికి వందనం కింద 20 లక్షల మంది బిడ్డలకు కోత పెట్టి, ఇప్పుడు సుఖీభవ పేరుతో సగం మంది రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వమే రూ.20వేలు ఇస్తుందని ఎన్నికల ప్రచారంలో బాబు ఊదరగొట్టారని, తీరా గెలిచాక కేంద్రం ఇచ్చే రూ. 6వేలతో ముడిపెట్టి నాలుక మడతేశారన్నారు. కేంద్రం ఇచ్చే రూ.6వేలు పక్కన పెడితే రాష్ట్ర నిధుల నుంచి మీరిచ్చేది కేవలం రైతుకి రూ.14వేలే అని చెప్పారు. కేంద్రం నేరుగా రైతుల అకౌంట్ లో వేస్తున్నప్పుడు మీరెలా ఇచ్చినట్లు చెప్పుకుంటారని ప్రశ్నించారు. ఇన్ని మాటలు చెప్పి ఇప్పుడు మీరెందుకు కేంద్రం నిధులతో లింక్ పెట్టారు ? మీరిస్తామని చెప్పిన రూ.20 వేలకు కేంద్రం వాటాను ఎందుకు జోడించారు ? హామీలు ఇచ్చేముందు కేంద్రం వాటాతో కలిపి అని ఎందుకు చెప్పలేదంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్ర ప్రభుత్వం నేరుగా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుకు రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నంద్యాల పార్లమెంటు ఉపాధ్యక్షులు అడ్మిన్ల జనార్ధన్, పీసీసీ నెంబర్, నంద్యాల పార్లమెంటు జిల్లా ఉపాధ్యక్షులు బాలస్వామి, ఓబీసీ స్టేట్ జనరల్ సెక్రెటరీ రమణ, అసంఘటిత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పఠాన అభి ఖాన్, శ్రీశైలం నియోజకవర్గం ఇంచార్జి ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# సమయపాలన పాటించాలి

మనగళం, కర్నూలు సిటీ : డాక్టర్లు, టెక్నిషయన్లు, సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్, డా.కె.వెంకటేశ్వర్లు సూచించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూ డయాగ్నస్టిక్ బ్లాక్ ను శనివారం ఆయన తనిఖీ చేశారు. బయో కెమిస్ట్రీ, రేడియాలజీ, పెథాలజీ, మైక్రో బయాలజీ, బ్లడ్ బ్యాంకు విభాగాలను పరిశీలించారు. రేడియాలజీ విభాగాన్ని తనిఖీ చేసి అక్కడ ఉన్న పరికరాలు గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బ్లడ్ బ్యాంకులో ఉన్న పరికరాలు, రిజిస్టర్ ను పరిశీలించి తలసీమియా కేసుల ఇన్వెస్టిగేషన్ల టెస్ట్ ల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో ఇన్ చార్జ్ సీఎస్ఆర్ఎంఓ డా.వెంకటరమణ, డిప్యూటీ సిఎస్ఆర్ఎంఓ డా.పద్మజ, అసోసియేట్ ప్రొఫెసర్ డా.శివబాల, ఇన్ చార్జ్ ఏఆర్ఎంఓ డా.సునీల్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా మహా గ్రూప్స్ ఛానల్ చైర్మెన్ వంశీ బర్త్ డే వేడుకలు...



మనగళం కర్నూలు : మహా గ్రూప్ చానల్స్ అధినేత మారెళ్ళ వంశీకృష్ణ పుట్టినరోజు వేడుకలు కర్నూల్ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఖలీల్ ఆధ్వర్యంలో నగర శివారులోని అమ్మ వృద్ధ శరణాలయంలో వృద్ధులకు మహా అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం వారికి దుప్పట్లు పంపిణీ చేయడంతో వృద్ధులు ఆనందం వ్యక్తం చేశారు. నిండు నూరేళు ్ళ జీవించాలని ఆశీర్వదించారు. ఆ తర్వాత సెడస్ చిన్నారుల అనాధాశ్రమంలో చిన్నారులచే కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా చిన్నారులు మహా గ్రూప్స్ అధినేత కు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎమ్మిగనూరు లో చిన్న పిల్లలకు భోజనం ఏర్పాటు చేసి వారి చేత కేక్ కట్ చేయించారు. డోన్ లో అయ్యప్ప ఆలయంలో వంశీ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంద్యాల జిల్లాలోని శ్రీశైలం ,మహానంది యాగంటి అహోబిలం ఆలయాల్లో వంశీ గారి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో జీవించాలని పూజారులు ఆశీర్వదించారు. అలాగే మహా న్యూస్ దినదినాభివృద్ధి చెందాలని కోరారు. ఈ వేడుకల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి మహా న్యూస్ రిపోర్టర్లు వెంకటేష్ శేఖర్ జగదీష్ కెమెరామెన్ రఫీ పాల్గొన్నారు.




# బళ్లారి రాఘవ కు ఘన నివాళి



మనగళం, కర్నూలు సిటీ: బళ్లారి రాఘవ దేశ సంస్కృతికి పాటుబడిన వ్యక్తి అని జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకటనారాయణమ్మ పేర్కొన్నారు. శనివారం ఉదయం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో బళ్లారి రాఘవ జయంతి వేడుకలను టూరిజమ్, ఐసిడిఎస్ పీడీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డీఆర్ఓతోపాటు అధికారులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ బళ్లారి రాఘవ అనంతపురం జిల్లా తాడిపత్రి లో 1880 సంవత్సరం ఆగస్టు 2న జన్మించి తన విద్యాభ్యాసం ను తాడిపత్రి, బళ్లారి,మద్రాస్ లలో పూర్తిచేసి మంచి న్యాయవాదిగా పేరు గడించారన్నారు. తెలుగు నాటక రంగానికి విశేషమైన కృషిచేసిన కళాకారుడిగా దేశ విదేశాల్లో పేరు గడిచారని గుర్తు చేశారు. తెలుగు, కన్నడ, ఇంగ్లీషు, హిందీ భాషలలో నాటక ప్రదర్శనలు ఇస్తూ హరిశ్చంద్ర, పాదుకా పట్టాభిషేకం, రామదాసు, తప్పు ఎవరిది అన్న నాటకాలను ప్రదర్శించేవారని తెలిపారు. ఐసిడిఎస్ పీడీ పి.విజయ మాట్లాడుతూ బళ్లారి రాఘవ కర్నూలుకు చెందిన కృష్ణమ్మతో వివాహం జరిగిందన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమించిందని, రావు బహదూర్ అన్న బిరుదు కూడా ఇచ్చి సత్కరించిందని గుర్తు చేశారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆర్గనైజర్ శారద, ఐసిడిఎస్ మరియు టూరిజం శాఖ సిబ్బంది బళ్లారిరాఘవ కు నివాళులు అర్పించారు.

# కర్నూలులో నిత్యపెళ్లికొడుకు

– మూడో వివాహానికి సిద్ధమైన ఉద్యోగి
– కలెక్టరేట్ ఎదుట ఇద్దరు భార్యల నిరసన



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ఓ ఉద్యోగి నిత్యపెళ్ళికొడుకుగా మారాడు. 57 ఏళ్ల వయస్సు లో ఏకంగా మూడో పెళ్ళికి సిద్ధమాయ్యా డు. ఇద్దరు భార్య ల ఆందోళన తో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట మొదటి భార్య, రెండో భార్య తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. వివరాలోకి వెళితే కర్నూలు జిల్లా పత్తికొండ విద్యుత్ శాఖలో జేఏఓ గా విధులు నిర్వహిస్తున్న కే. మధుభాస్కర్ రావు 1993 సంవత్సరంలో కర్నూలు కు చెందిన కరణం రాధాలక్ష్మి తో వివాహం అయ్యింది. వీరికి ఒక కూతురు సంతానం. కొన్ని రోజుల తర్వాత 1993లో విద్యుత్ శాఖలో అటెండర్ గా విధులు నిర్వహిస్తున్న సీ. పద్మావతి ని ప్రేమించి పెళ్లి చేసుకున్నారని మధుభాస్కర్ రావు భార్యలు తెలిపారు. రెండో వివాహం సందర్భంగా తన మొదటి భార్య కు ఆరోగ్యం సరిగాలేదని విడాకులు ఇచ్చనని అబద్ధం చెప్పి పెళ్లి చేసుకున్నాడని రెండో భార్య తెలిపింది. ప్రస్తుతం భాస్కర్ రావు విద్యుత్ శాఖలో పనిచేస్తున్న మరో మహిళను వివాహం చేసుకున్నాడని వారు తెలిపారు. ఇలా ఎంతమంది మహిళలల జీవితాలతో ఆడుకుంటాడని భాస్కర్ రావు పై చర్యలు తీసుకోవాలని వారు కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. భాస్కర్ రావు సర్వీస్ రిపోర్ట్ (ఎస్.ఆర్) లో మూడో భార్య పేరు నమోదు చేశారని మొదటి భార్య తెలిపారు. తనకు విడాకులు మంజూరు కాలేదని అయినా తన భర్త విడాకులు తీసుకున్నట్లు చెబుతున్నాడన్నారు. తమకు తనభర్త నుంచి ప్రాణహాని ఉందని ఇద్దరు భార్యలు తెలిపారు.

# అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం అండ

– అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలో అర్హులైన 2,73,452 రైతులకు రూ.183 కోట్లు లబ్ధి
– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా






మనగళం, ఎమ్మిగనూరు : అన్నదాతకు ప్రభుత్వం అండ గా నిలుస్తోందని, జిల్లాలో అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ పథకం కింద జిల్లాలో అర్హులైన 2,73,452 రైతులకు రూ.183 కోట్లు లబ్ధి కలిగిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం ఎమ్మిగనూరు మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసి లో అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ 2025– 26 మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ– పీఎం కిసాన్ పథకం ద్వారా ప్రతి రైతు కుటుంబానికి 3 విడతలుగా 20 వేల రూపాయలు అందించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా శనివారం మొదటి విడత కింద రైతుల ఖాతాల్లో 7 వేల రూపాయలు జమ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 2 లక్షల 70 వేల ఎకరాల్లో పంటలు సాగవుతోందని, 9 వేల 264 క్వింటాళ్ళ విత్తనాలను, ఎరువులను పంపిణీ చేశామన్నారు. యూరియాకు ఇంకా డిమాండ్ ఉందని, ప్రస్తుతం అన్ని రైతు సేవా కేంద్రాల్లో, పాక్స్ లో యూరియాను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం పెరగాలని, యూరియా ను తగ్గించి నానో ఎరువుల వాడకానికి అలవాటు పడాలన్నారు. జిల్లాలో న్యాచురల్ ఫార్మింగ్ కింద లక్ష 32 వేల ఎకరాలలో సాగు లక్ష్యం కాగా 52 వేల ఎకరాల్లో నేచురల్ ఫార్మింగ్ చేస్తున్నామన్నారు. పంటల సబ్సిడీ, పంటల ఇన్సూరెన్స్, అన్నదాత సుఖీభవ తదితర పథకాలకు ఈ క్రాప్ ఆధారంగా డేటా తీసుకోవడం జరుగుతుందని, రైతులందరూ ఖచ్చితంగా ఈ కేవైసీ చేయించుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు. డ్రోన్ టెక్నాలజీ ని ఉపయోగించుకుని రైతులు లబ్ధి పొందాలని కలెక్టర్ రైతులను కోరారు. అదేవిధంగా జిల్లాలో రైతులు హార్టికల్చర్ పంటల సాగు ను పెంచాలన్నారు. ఈ ఏడాది కూడా గాజుల దిన్నె ప్రాజెక్ట్ కు కూడా నీటిని వదలడం జరుగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ 3 వేల 500 క్యూసెక్కుల మేరకు వెడల్పు చేయడం జరిగిందని, తద్వారా జిల్లాలో నీటి పారుదల సౌకర్యం పెరుగుతుందన్నారు. అలాగే 68 ట్యాంక్ లను పూర్తిగా నింపడం జరుగుతోందన్నారు. అనంతరం అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధి కి సంబంధించిన మెగా చెక్కును రైతులకు అందచేశారు. అదే విధంగా రైతులకు విత్తన సంచులను అందించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను ను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు మార్కెట్ చైర్మన్ మల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, తహసీల్దార్ శేషఫణి, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై దగ్ధ మైన లారీ





మన గళండోన్ పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఉంగరాని గుండ్ల స్టేజి సమీపంలో నెంబర్ %చీూ0 1ూ ూ%2335 గల గూడ్స్ వెహికల్ బెంగళూరు నుంచి 40 హెూండా యూనికాన్ బైక్ లతో మహారాష్ట్రకు వెళుతున్న సమయంలో షార్ట్ సర్క్యూట్తో అంటుకోవడం జరిగింది. క్యాబిన్లో పండుకున్న డ్రైవర్ అప్రమత్తమై కిందికి దిగిపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు ఆస్తి నష్టం జరిగింది. క్యాబిన్ మొత్తం ఖాళీ బూడిదైంది ఫైర్ అధికారులు సమాచారం తెలుసుకొని అక్కడికి వెళ్లి మంటలను అదుపు చేయడం జరిగింది. డ్రైవర్ ఊపిరి పీల్చుకున్నాడు. ఆయన మొబైల్ కొంత నగదు కాళీ బూడిద కావడం జరిగింది అని డ్రైవర్ తెలిపారు.

# నంద్యాల జిల్లా సిపిఐ రెండో మహాసభలు విజయవంతం




మనగళండోన్ మహాసభలకు సహాయ సహకారాలు అందించిన డోన్ పూర్వ ప్రముఖులకు కృతజ్ఞతలు సిపిఐ స్థానిక సిపిఐ నక్కి రామన్న కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి పి సుంకయ్య కోశాధికారి రాధాకృష్ణ నారాయణ వారు మాట్లాడుతూ ఈనెల 30 31 తేదీన డోన్ పట్టణంలో నంద్యాల జిల్లా రెండో మహాసభలు ఘనంగా జరిగింది కొత్త బస్టాండ్ నుండి పాత బస్టాండ్ గాంధీ సర్కిల్ వరకు ర్యాలీగా బయలుదేరారు విప్లవ గేయాలు కోలాటాలు ఎర్ర సైన్యం కదం తొక్కారు.ప్రతినిధుల మహాసభ ఈనెల 31 తేదీన మార్కెట్ యార్డు పక్కన క్రిస్టియన్ హాల్లో జరిగాయి.ఈ మహాసభలను విజయవంతం కోసంతోడ్పాటు అందించిన పూర్వ ప్రముఖ లకు పారిశ్రమ వేతలకు వ్యాపారస్తులకు పార్టీ సానుభూతిపరులకు ఉద్యోగస్తులకు మీడియా ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం మహిళా సంఘం చేతి వృత్తిదారుల సంఘం అనుబంధ సంఘాల నాయకులు ఈ మహాసభలకు విజయవంతం తోడ్పాటు అందించి విజయవంతంగా చేసినందుకు మహాసభల ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి పి సుంకయ్య సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడుకృతజ్ఞతలు తెలిపారు. డోన్ పట్టణంలోనే సిపిఐ జిల్లా రెండో మహాసభలు ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ ఎఈ మహాసభల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యచరణ రూపొందించామని వారన్నారు

కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు నుంచి ముస్లింల పైన దళితుల పైన మహిళల పైన రోజురోజుకీ దాడులు జరుగుతున్నాయని వారన్నారు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వం పేదలకు గ్రామీణ ప్రాంతాలకు మూడు సెంట్లు పట్టణ ప్రాంతాలకు రెండు సెంట్లు ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చావు సంవత్సరం కావస్తున్న ఇంతవరకు అమలు చేయకపోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారన్నారు పేదల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేసే భారత కమ్యూనిస్టు పార్టీ పేదలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చకుంటే నిరాహార దీక్ష చేస్తామని పోరాటాలని ఉధృత చేస్తామని ఈ మహాసభలను లో కార్యచరణ రూపొందించామని అన్నారు

ఈనెల 5వ తేదీన స్మార్ట్ మీటర్ల వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు సిద్ధం కావాలని వారన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మోటా రాముడు సిపిఐ మండల కార్యదర్శి నారాయణ సిపిఐ ప్యాపిలి మాజీ మండల కార్యదర్శి వెంకటేశు పట్టణ సహాయ కార్యదర్శి రామ్మోహన్ ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి పృథ్వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



మనగళం, ఎమ్మిగనూరు: విద్యార్థి దశలోనే ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, లక్ష్యాల సాధనకు కష్టపడాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా విద్యార్థులకు సూచించారు. శనివారం ఎమ్మిగనూరు మండలంలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలికల జూనియర్ కళాశాల, గురుకుల బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణం, తరగతి గదులు పరిశీలించి విద్యార్థులతో సంభాషించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రమ, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు" అని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు తమ చదువులోనే కాకుండా వ్యక్తిత్వ వికాసంలో కూడా ముందుండాలన్నారు. చిన్న వయస్సులోనే ఐఏఎస్, ఐపీఎస్, వైద్యులు, ఇంజనీర్లు వంటి ఉన్నతమైన లక్ష్యాలను నిర్ణయించుకుని, సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ కళాశాలలకు సమానంగా ప్రభుత్వం గురుకుల విద్యాసంస్థలకు ఆధునిక సదుపాయాలు అందజేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని, పాఠశాల, కళాశాలల్లో నాణ్యమైన బోధనతో పాటు విలువ ఆధారిత విద్యను అందించాలన్నారు. ప్రభుత్వం విద్యారంగంలో అమలు చేస్తున్న పథకాలు, ముఖ్యంగా గురుకుల పాఠశాలల ప్రాముఖ్యత, వాటి ద్వారా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు లభిస్తున్న అవకాశాలను గురించి కలెక్టర్ వివరించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న గదులను పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా నిర్మాణ పనులను పూర్తిచేయాలని ఇంజనీర్ లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే డిజిటల్ క్లాసులకు ఇంటర్నెట్ సదుపాయం కావాలని ప్రిన్సిపాల్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహసీల్దార్ శేష ఫణి, కళాశాల ప్రిన్సిపాల్ సౌజన్య లత, పాఠశాల ప్రిన్సిపాల్ సామ్రాజ్యం, అధికారులు పాల్గొన్నారు.

# కుర్ణి సంక్షేమ సంఘ మహా సభను జయప్రదం చేయాలి



మన గళం గూడూరు: కోడుమూరు పట్టణంలో ఈనెల 7న చేపట్టిన జాతీయ చేనేత దినోత్సవం, కుర్ణి సంక్షేమ సంఘం ప్రధమ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని కుర్ణి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సి. బి. అజయ్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలో శుక్రవారం రాష్ట్ర కుర్ణి సంఘం ప్రధమ మహా సభకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు రాయితీపై బ్యాంకు రుణాలు, సబ్సిడీలు, ప్రోత్సాహకాలను అందించి ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు. చేనేత వస్త్రాలకు ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొని వచ్చి మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. కులం యొక్క పేరులో కుర్ణి, నెస్సీ లతోపాటు కుర్ణి సాలె కూడా చేర్చాలని, పద్మశ్రీ మాచాని సోమప్ప పేరిట ఒక చేనేత భవనం ను రాష్ట్ర జిల్లా స్థాయిలో ఏర్పాటు చేయాలని, చేనేతలను ఒక సంవత్సరానికి రూ. 36,000 పెన్షన్ పునరుద్ధించాలని, ఉచిత కరెంటు రూ.5 వేలకు పెంచాలని, చేనేత రుణాలు మాఫీ చేయాలని, కొత్తగా రుణ సదుపాయం అందించాలని, చేనేత వస్త్రాలు 11 రకాను కచ్చితంగా అమలు చేయాలని, చేనేత ఉత్పత్తులపై జిఎస్టి రద్దు చేయాలని, చేనేత, జౌళి శాఖలను విభజించాలని, చేనేతలకు ఐదు సెంట్లతో గృహ వసతి కల్పించాలని, ముద్ర రుణాలలో చేనేతలకు ప్రాధాన్యం పెంచాలని, చేనేతలకు మార్కెటింగ్ సౌకర్యంతో పాటు ఆప్కోను బలపరచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కుర్ణి సంఘం సహాయ కార్యదర్శి బుగుడే వెంకటేశ్వర్లు, భూషణం, బాలస్వామి, ఎల్లప్ప,నరసింహ, చిన్న, పరమేష్ పాల్గొన్నారు.

# రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

బేడీల వలతో ఎన్నాళ్లు ఏలుతరు?

'తెలంగాణ పరిరక్షణ పోరులో మరింత పదునెక్కి పోరాడుదాం' అని ఇటీవల మహా న్యూస్ వివాదం నేపథ్యంలో, అక్రమ కేసులతో ఇరువై రోజులు చంచల్‌గూడ జైల్లో గడిపి బయటికొచ్చిన సందర్భంగా విద్యార్థి నేతలు భావోద్వేగంతో పునరుద్ఘాటించారు. నిజానికి వారి మాటలను సర్కార్ పెద్దలు విని ఉంటే, ఆ క్షణం నుంచే వాళ్లు దగ్గర పెట్టుకొని ప్రభుత్వ పనితీరును సరిచేసుకునేవారు. అసలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలకు హృదయముండనే ఉండదనే వాస్తవానికి చరిత్రనే రుజువు. కానీ, కనీసం వినికిడి సామర్థ్యం సైతం శూన్యమనే సత్యాన్ని రేవంత్ సర్కార్ తేటతెల్లం చేసింది. దానివల్లనే ఎఫ్‌ఐఆర్‌లు, అరెస్టులు, రిమాండ్‌ల కోసం ప్రభుత్వం పరితపిస్తూనే ఉన్నది. పోలీస్‌స్టేషన్‌లను ఔట్ పోస్టులుగా మలుచుకొని తెలంగాణ వ్యతిరేక సర్కార్‌ను సంరక్షించుకోవడం సాధ్యపడదని విజయ తెలంగాణ నేపథ్యమే నిరూపిస్తున్నది కదా? మరెందుకు రేవంత్ సర్కార్ అలాంటి విఫల నమూనాను అనుసరిస్తున్నది? ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు, లగచర్ల నుంచి సెంట్రల్ వర్సిటీ వరకు నలుమూలలనూ బేడీల భూతంతో భయపెట్టాలనే, పారని పాలనా మంత్రాన్నే పదే పదే విచిత్రంగా ప్రయోగిస్తున్నది.

అవన్నీ హింసిం చే రాజు ఇరవై మూడవ రాజు పులకేశి సినిమాలోలా హాస్యాస్పదంగా మారిపోయాయి. పదిహేడవ శతాబ్దంలో చోళపురం పాలయం రాజైన, మహా మూరు?డు పులకేశి, బ్రిటిష్ వారికి తొత్తుగా మారి ఆ రాజ్య ప్రజలను నానావిధాలా హింసించాడు. చివరికి వివిధ కులాలు కొట్టుకోవడానికి ప్రత్యేక స్టేడియాలను సహితం నిర్మించిన పులకేశి, చరిత్రలో విధ్వంసక చక్రవర్తిగా ఘనతకెక్కాడు. విభజించి, చొరబడి, చెరబట్టాలనే బ్రిటిషర్ల కుట్రలను తు.చ. తప్పక అమలుచేసిన అమానవీయ రాజు ఆనాటి పులకేశి. మరి నేడు మన రాష్ట్రంలో కూడా వివాదాలు, కట్టు కథలు, కేసులు ఇలా ఎన్నో మాయోపాయాల మంత్రదండాన్ని సర్కార్ నమ్ముకొని నడక సాగిస్తున్నది కదా?.

విద్యార్థులను జైలుకు పంపిన మహా న్యూస్ వంటి వివాదం ఒకవేళ తమిళనాడులోనో, మహారాష్ట్రలోనో జరిగి ఉంటే నిరసన కాదు, నిప్పుల తుపాన్ పుట్టేది. ఆయా రాష్ట్రాల ఆత్మగౌరవమే ఆశయంగా పోరాడే స్టాలిన్ మీదో, ఠాక్రేల పైనో తంబ్‌నెయిల్స్‌తో అక్కడి ఏ మకిలి మీడియా అయినా తెగబడి ఉంటే ఏం జరిగి ఉండేదో వివరించనక్కర్లేదు కదా?. నాయకత్వాన్ని దూరం చేస్తే తప్ప వనరులపై అజమాయిషీ అసాధ్యమనే దుర్బుద్ధితో పాటు, పైచేయి సాధించిన తెలంగాణను తిరిగి పాతాళానికి చేర్చాలనే చంద్రబాబు నాయుడి వ్యూహాత్మక ఎత్తుగడే మీడియా ముసుగులో దాడిగా మారింది. పదేండ్ల స్వయం పాలనలో ఆదాయ గోపురంలా పునర్నిర్మాణమైన తెలంగాణను కొల్లగొట్టడానికి అడ్డుపడే నాయకత్వాన్ని, రాజకీయంగా మట్టుబెట్టడానికి వికృత ఎత్తుగడలకు ఒడిగడుతున్నాడు. అయితే ఇది తెలంగాణలో అమలవుతున్న సరికొత్త సర్కార్ ఫార్ములా ఏం కాదు. వాస్తవానికి పోరులోనే పరవశించింది తెలంగాణ. ప్రజారాశుల శత్రువు పన్నే వ్యూహాల గురించి దశాబ్దాల కిందటే మాటల్లో, పాటల్లో విశ్లేషించుకున్నది. 'నాలుకలపై పూసే తీపంతా తేనె కాదు, చెవుల్లో వొంపే కథంతా కుట్రాతీతం కానే కాదు. ఏమరుపాటుతో ప్రతి కట్టుకథకూ తలలూపితే, సర్వస్వం తాకట్టు ఖాయమనే వాస్తవం అనుభవపూర్వకంగా తెలంగాణకు తెలుసు. అయితే వినపడేది మాత్రమే కాదు, కనపడేదంతా కూడా నిజం కాదనేది పెట్టుబడిదారీ రాజకీయాలకు పేటెంట్ అయిన చంద్రబాబు నాయుడు లాంటి పాలకుల వల్ల ఏనాడో తేటతెల్లమైంది. ఉమ్మడి రాష్ట్ర కాలంలోనే కాదు కాస్త వెనక్కి మళ్ళీ ప్రపంచ చరిత్రను పరిశీలించినా, అస్తిత్వ రాజకీయ శక్తుల వ్యక్తిత్వ హననానికి దోపిడిదారులు ఎంత విషం పారించారో, ఎంతెంత నెత్తురు తాగారో తేలిగ్గానే అర్థమవుతుంది. మన అనుభవమైన, చరిత్రైన స్వీయ రాజకీయ అస్తిత్వాన్ని అస్థిరపరచడం వెనుక ఏ రాజకీయ, అసాంఘిక శక్తుల ప్రయోజనాలు దాగి ఉంటాయోనన్నది కండ్ల ముందుంచుతున్నది. అందుకే, ఇప్పుడు తెలంగాణలో కేసీఆర్ పరివారంపై, పార్టీపై సాగుతున్న విష ప్రచారాన్ని లోతుగా అందరం అర్థం చేసుకోవాలి. అవినీతి నుంచి మొదలుపెట్టి విలీనం వరకు నిత్యం వండి వారుస్తున్న వార్తల వెనుక మర్మాన్ని స్పష్టంగా చూడగలగాలి. నిధులు, నదులు ఎత్తుకెళ్లే ఎత్తుగడలతో ఎలా పావులు కదుపుతున్నారో నగ్నంగా కనపడిపోతూనే ఉన్నది కదా?

ఈ కుయుక్తులిలా సాగుతుంటే, బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలో డ్రామాలకు, పాదయాత్రల పేరిట పల్లెల్లో పగటివేషాలకు హస్తం పార్టీ తెగబడుతున్నది. వీటన్నింటినీ తెలంగాణ హృదయంతో జాగ్రత్తగా చూడక, పైపై చూపులతో ఎవ్వరమూ సరిపెట్టుకోరాదు. రేవంత్‌ను నమ్ముకొని అమరావతి, మీనాక్షిని ముందుపెట్టి హస్తిన మొత్తం తెలంగాణ అస్తిత్వాన్ని పలుచన చేసే రాజకీయాలు నడిపిస్తున్నారు. విద్యార్థులు, యువత, బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, రైతులు ఇలా అన్నివర్గాలకు ద్రోహం తలపెట్టడమే కాదు, తెలంగాణ తలనూ తాకట్టు పెట్టేస్తున్నారు. దానికోసమే తెలంగాణలో బిగిసిన ప్రతి పిడికిలికీ బేడీలు వేసేస్తున్నారు. కానీ రేవంత్ రెడ్డి సర్కార్ అరెస్టు చేసిన ప్రతి ఉద్యమకారుడు కూడా 'కంసుని చెరలోని కన్నయ్య' మాదిరిగా పెరిగి అరాచక ప్రభుత్వ పతనానికి అంతిమ తీర్పును రాయడం ఖాయం. బేడీల వల విసిరి తెలంగాణను లొంగదీసుకోగలమని కలగనడం వారి మూర?త్వానికి నిలువుటద్దం. ఈ వికృత వ్యూహాలతో తెలంగాణను ఎన్నాళ్ళేలగలరు.

## కిసాన్ 20వ విడత నిధులు విడుదల చేసిన సందర్భంగా డోన్ లో నరేంద్ర మోడీ గారికి పాలాభిషేకం చేసిన బీజేపీ నాయకులు

మన గళండోన్‌లిప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు ఉత్తరప్రదేశ్ వారణాసి పర్యటనలో పిఎమ్ - కిసాన్ 20వ విడత 9.7 కోట్లకు పైగా రైతులకు ఆర్థిక భరోసా సుమారు రూ.20,500 కోట్ల రూపాయలు నేరుగా రైతుల ఖాతాలలో జమ చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ డబ్బులు విడుదల చేశారు, ఈ సందర్భంగా డోన్ పాతబస్టాండ్ వద్ద నరేంద్ర మోడీ గారికి ధన్యవాదములు తెలుపుతూ పాలాభిషేకం చేసిన బీజేపీ నాయకులు, అలాగే రాష్ట్ర రైతులకు కూటమి ప్రభుత్వం అదనంగా 5000రూపాయలు అందిస్తూ రైతుల పక్షపాతం ప్రభుత్వం గా పేరు తెచ్చుకుంది అని ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి అన్నారు,. వారు మాట్లాడుతూ రైతుల కు పెట్టుబడి సాయం కింద మోడీ ప్రభుత్వం ఇప్పటికి 20విడతలలో 40వేల రూపాయలు ఇచ్చారు అని అన్నారు, ఈ కార్యక్రమం లో విశ్వకర్మ ఇంప్లిమెంటేషన్ మెంబెర్ ఆర్మీ రామయ్య, ఐటీ సెల్ కన్వీనర్ ఆరబోలు వీరేష్, ఓబీసీ మోర్చా నాయకులు నాగార్జున, ఆవుకు వెంకటేశ్వర్లు, ముదిరాజ్ లక్ష్మీనారాయణ, జీవీ చలపతి రావ్, మరియు బీజేపీ నాయకులు రైతులు పాల్గొన్నారు.



## ఇది రైతు ప్రభుత్వం ఎమ్మెల్యే కోట్ల







మన గళండోన్ ఆర్ అండ్ బి అతిథి గృహంలో జరిగిన అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కార్యక్రమంలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,రైతుల ఆదాయాన్ని పెంచేందుకుమరియు భవిష్యత్‌లో వ్యవసాయాన్ని లాభదాయకంగా మారుస్తుందనే దృష్టితో పీఎం కిసాన్ పథకం అమలవుతోందని పేర్కొన్నారు. రైతులకు అందాల్సిన నిధులు సమయానికి జమ కావడంలో ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరిస్తోందన్నారు. ఇవే కాక రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు పనిముట్లు విత్తనాలు ఎరువులు డ్రోన్ కెమెరాలు ఇవ్వబడునని తెలిపారు.కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ, లక్క సాగరం లక్ష్మిరెడ్డి, హరికిషన్, డీసీఎంఎస్ చైర్మన్ చంద్రపల్లి నాగేశ్వరరావు యాదవ్, హార్టికల్చర్ అధికారి కళ్యాణి ప్రకృతి వ్యవసాయ అధికారులు, అగ్రికల్చర్ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి రైతులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన ఎంపీ బస్తిపాటి నాగరాజు

మనగళం, సి.బెళగల్ : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు లబ్ధిదారునికి అందజేశారు. కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలం సుంకేసుల గ్రామానికి చెందిన కురువ శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యానికి గురై ఓ ప్రయివేట్ ఆసుపత్రి లో చికిత్స పొందారు. ఎంపీ నాగరాజు సిఫార్సు తో బాధితుడు సీఎం సహాయ నిధికి దరఖాస్తూ చేసుకోగా రూ.1,42,744 మంజూరు అయ్యింది.ఈ మేరకు ఎంపీ నగరంలోని తన కార్యాలయంలో లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పాటు పడుతుందన్నారు. సీఎం సహాయనిధి సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## రంగస్థలం నాటకాలకు విశేష సేవలందించిన రాఘవాచార్య

మనగళం, నంద్యాల: రంగస్థలం నాటకానికి బళ్లారి రాఘవాచార్య విశేష సేవలు అందించారని డీఆర్‌ఓ రాము నాయక్ పేర్కొన్నారు. శనివారం నంద్యాల కలెక్టరేట్ నందు బళ్ళారి రాఘవాచార్య జయంతి సందర్భంగా డీఆర్‌ఓ రామునాయక్, జిల్లా అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ రామునాయక్ మాట్లాడుతూ తాడిపత్రి ఆచార్య అని పేరొందిన రాఘవాచార్య రంగస్థలం నాటకంలో వైవిధ్యమైన పాత్రలు ధరించి పరిణితి చెందిన కళాకారుడుగా గుర్తింపు పొందారన్నారు. తొలి తరం కళామ్మతల్లి ముద్దుబిడ్డగా నేటితరం నటీనటులకు ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. రాయలసీమలో జన్మించిన రాఘవాచార్య రంగస్థలంలో తన నటనతో ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. గాంధీజీతో పాటు విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ లతో నటనతో శభాష్ అనిపించుకున్న నటుడని తెలిపారు. తెలుగు నాటకాలతో పాటు ఆంగ్లము కన్నడ భాషలలో సైతం నాటకాలను ప్రదర్శించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## పింగళి వెంకయ్యకు ఘన నివాళి



మనగళం, ఆళ్లగడ్డ : జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని శనివారం అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కందుకూరు రోడ్డు వైపు ఉన్న ఐ డి ఎస్ హై స్కూల్ లో ఆయన చిత్ర పటానికి అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం అధ్యక్షులు టి అమీర్ బాషా, అపుస్మ కోశాధికారి, కరస్పాండెంట్ వై ఎన్ చంద్రశేఖర్, స్కూల్ డైరెక్టర్ జానకి, ప్రిన్సిపాల్ కే లింగారెడ్డి, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పింగళి వెంకయ్య త్యాగాలను ఈ సందర్భంగా టి అమీర్ బాషా గుర్తు చేశారు. పింగళి వెంకయ్య సేవలను గుర్తించి భారతరత్న పురస్కారాన్ని అందించాలని ఆయన కోరారు.

## రాజకీయాలకు అతీతంగా ప్రగతికి పాటుపడాలి

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు రాజకీయాలకు అతీతంగా పనిచేద్దామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో మేయర్ బి.వై. రామయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మంత్రి భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, కమిషనర్ పి.విశ్వనాథ్ హాజరయ్యారు. 31 అజెండా అంశాలపై చర్చించారు. రూ..29.58 కోట్ల నిధుల ఖర్చుకు పచ్చజెండా ఊపారు. పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు. అజెండా అంశాలపై చర్చించి, పలు సూచనలు చేశారు. ఇటివల సంతోష్ నగర్ వద్ద ప్రధాన పైప్‌లైన్ లీకేజీల కారణంగా తాగునీటి సరఫరాకు ఏర్పడిన ఆటంకాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించామని, అభివృద్ధి పనులను జాప్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేసేందుకు అందరూ కలిసి రావాలని కోరారు.



నగరాభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా పనిచేద్దామని మంత్రి పిలుపునిచ్చారు. అయితే అనివార్య కారణాల వలన సభ వాయిదా పడింది.

# యువతకు ఆదర్శంగా నిలిచిన శ్రీశైలం యువకుడు ఎస్.కె.యాసిన్ విజయగాథ.

మనగలం : కూలీగా పనిచేస్తున్న తండ్రే ఆంధ్రప్రదేశ్ పోలీసు కొలువులు సాధించి, సంకల్పం బలంగా ఉంటే, ఎన్ని అడ్డంకులు ఎదురైనా విజయం మన పాదాక్రాంతం అవుతుందని నిరూపించాడు శ్రీశైలం ప్రాంతానికి చెందిన ఓ యువకుడు. కళ్లెదుట తండ్రి పడుతున్న కష్టాన్ని గుండెల్లో నింపుకొని, తన చెమటను సిరాగా మార్చి రెండేళ్ల వ్యవధిలో రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగాలను సాధించి శెభాష్ అనిపించుకున్నాడు. అతనే ఎస్.కె.యాసిన్. తల్లి షేక్ ముర్తుజాబీ, తండ్రి షేక్ హుస్సేన్ షా ల ముద్దుల కుమారుడైన యాసిన్ సాధించిన ఈ అపురూప విజయం, అతని కుటుంబంలోనే కాక, శ్రీశైలం ప్రాంత యువతలో నూతనోత్తేజాన్ని నింపుతోంది.



తండ్రి కష్టమే.. గుండెను కదిలించింది

షేక్ హుస్సేన్ షా ఒక సామాన్య కూలీ. కుటుంబ పోషణ కోసం రేయింబవళ్లు ఆయన పడే శ్రమను యాసిన్ చిన్నప్పటి నుంచి చూస్తూ పెరిగాడు. తండ్రి కళ్లలో కనిపించే అలసట, తన భవిష్యత్తు కోసం ఆయన పడుతున్న తపన యాసిన్ మనసులో బలంగా నాటుకుపోయాయి. ఎలాగైనా ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధించి, తన తండ్రికి విశ్రాంతినివ్వాలని, కుటుంబాన్ని ఆదుకోవాలని అప్పుడే ప్రతినబూనాడు. ఇంటర్మీడియట్, డిప్లొమా పూర్తి చేసిన తర్వాత ఉన్నత చదువులకు ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా, తన లక్ష్యాన్ని మాత్రం మరువలేదు. ఓపెన్ డిగ్రీలో చేరి, ఇంటి వద్దనే ఉంటూ ఉద్యోగ సాధన అనే యజ్ఞాన్ని ప్రారంభించాడు.

**రెండు రాష్ట్రాలు, ఒకే సంకల్పం: తండ్రి చెమట చుక్కలకు కొడుకు అక్షర నీరాజనం!**

ఏకాగ్రతే ఏకైక ఆయుధం

సుమారు ఏడాదిన్నర పాటు యాసిన్ బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా ఏకాగ్రతతో చదువుకున్నాడు. స్నేహితులు, శుభకార్యాలు అన్నింటినీ పక్కనపెట్టి, కేవలం పుస్తకాలనే నేస్తాలుగా చేసుకున్నాడు. తల్లిదండ్రులు అందిస్తున్న ప్రోత్సాహమే ఆక్సిజన్‌గా, తండ్రి కష్టమే ప్రేరణగా ప్రతిక్షణం శ్రమించాడు. ఈ కఠోర దీక్ష ఫలించి, 2023లో వెలువడిన తెలంగాణ రాష్ట్ర పోలీసు నియామక ఫలితాల్లో సత్తా చాటాడు. అత్యంత పోటీ ఉండే 5% ఓపెన్ కేటగిరీలో టీఎస్ఎస్పీ (తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్) కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి తన మొదటి విజయాన్ని అందుకున్నాడు.



అంతటితో ఆగని ప్రస్థానం

తెలంగాణలో ఉద్యోగం వచ్చినా, యాసిన్ తన లక్ష్యాన్ని అక్కడితో ఆపలేదు. సొంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉద్యోగం సాధించాలనే తపనతో తన ప్రయత్నాన్ని కొనసాగించాడు. టీఎస్ఎస్పీలో శిక్షణ తీసుకుంటూ, విధులకు హాజరవుతూనే ఏపీ పోలీస్ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యాడు. ఇది కత్తి మీద సాము లాంటిదే అయినా, అతని పట్టుదల ముందు ఆ కష్టం చిన్నబోయింది. 2025లో వెలువడిన ఏపీఎస్పీ (ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్) ఫలితాల్లోనూ విజయకేతనం ఎగురవేసి, తన ప్రతిభకు తిరుగులేదని నిరూపించుకున్నాడు. ఒక ఉద్యోగంలో ఉంటూ మరో రాష్ట్రంలో ఉద్యోగం సంపాదించడం అతని నిబద్ధతకు, కృషికి నిలువుటద్దం.

లక్ష్యం ఉన్నతం.. ఆశయం గొప్పది

"నాన్న పడే కష్టం చూడలేకపోయేవాడిని. ఆయనకు ఒక మంచి జీవితాన్ని ఇవ్వాలనేదే నా కోరిక. అమ్మ ప్రోత్సాహం లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు. కానిస్టేబుల్ ఉద్యోగాలతో నేను సంతృప్తి చెందను. ఎస్సై లేదా గ్రూప్–2 అధికారి కావాలన్నది నా కల. ఆ దిశగా నా ప్రయాణం కొనసాగుతుంది," అని యాసిన్ ఎంతో ఆత్మవిశ్వాసంతో చెబుతున్నాడు. కష్టాలనే మెట్లుగా మార్చుకొని, తల్లిదండ్రులను స్ఫూర్తిగా తీసుకొని, రెండు రాష్ట్రాల్లో కొలువులు సాధించిన యాసిన్ విజయగాథ, సరైన ప్రోత్సాహం, బలమైన సంకల్పం ఉంటే పేదరికం గెలుపుకు అడ్డంకి కాదని చాటిచెబుతోంది. అతని ఉన్నత లక్ష్యాలు నెరవేరాలని మనసారా ఆశిద్దాం.

# అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ 2025-2026 పథకం మొదటి విడుత పంపిణీ కార్యక్రమం



మన గళం గూడూరు: కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గంలోని గూడూరు మండలం కేంద్రం నందు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముఖ్య అతిథులుగా విచ్చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఎన్నికలలో హామీల భాగంగా ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్నారని అలాగే మరో సూపర్ సిక్స్ హామీ నెరవేరుతోంది. ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సహకారం చేస్తామని మన ముఖ్యమంత్రి అన్నదాతలకు ఇచ్చిన హామీలో భాగంగా... 46,85,838 లక్షల మంది రైతుల ఖాతాల్లో 'అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్' పథకం కింద మొదటి విడత డబ్బులు రూ.7000 చొప్పున జమ కానున్నాయి. ఇప్పటికీ సూపర్ సిక్స్ హామీలలో పెన్షన్ 3000 నుండి 4000 కి వికలాంగుల పెన్షన్ 3000 నుండి 6000 ఒకేసారి పెంచారు మరియు ఉచిత గ్యాస్ సిలిండర్ సంవత్సరానికి మూడు ఇస్తున్నారు. మరియు తల్లికి వందనం పథకం కింద స్కూలుకు వెళ్లే ప్రతి ఒక్క విద్యార్థులకు డబ్బులు జమ చేశారు మేగా డీఎస్సీ పోస్టులు మరియు 5రూ. లకే అన్నా క్యాంటీన్ లో భోజనం పెడుతున్నారు నిరుపేదలు ఎందరో కడుపునిండా భోజనం చేస్తున్నారు అలాగే అన్నదాత సుఖీభవ హామీ కూడా నెరవేర్చిన ఘనత నారా చంద్రబాబు నాయుడు కి దక్కింది మున్ముందు ఆగస్టు 15 తారీకు నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం హామీ కూడా తీరుస్తున్న ఘనత కూడా వారికే దక్కిందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మండల రెవెన్యూ అధికారులు మరియు నాలుగు మండలాల టిడిపి నాయకులు, రైతులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు







# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**– రాష్ట్ర మైనార్టీ, న్యాయ, సంక్షేమశాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్**

మనగళం, నంద్యాల : రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర మైనార్టీ, న్యాయ, సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. నంద్యాల మండల పరిధిలోని కానాల గ్రామంలోని బుగ్గ రామేశ్వరం దేవాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ నగదు జమ నేపథ్యంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు పీఎం, సీఎం ప్రత్యక్ష ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ మాట్లాడుతూ రైతులు పంట వేసినప్పటినుంచి ధాన్యం ఇంటికి వచ్చేవరకూ ప్రభుత్వం అండగా ఉంటూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించడం జరుగుతుందన్నారు. రైతు బాగుంటే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు రైతుల సంక్షేమానికి విశేష కృషి చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి వ్యవసాయ రంగంలో విశేష మార్పు కనిపించే విధంగా సబ్సిడీతో యంత్ర పరికరాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. గతంలో పెన్షన్, రేషన్ కార్డులు కావాలంటే కార్యాలయాల చుట్టూ తిరిగే వారిని నేడు అధికారులు ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల గుమ్మం తట్టి వారికి పథకాలు అందించడం జరుగుతుందన్నారు. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం, తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి ఈ పథకం వర్తింపజేయడం జరుగుతుందన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో చాలామంది నిరుద్యోగులకు ఉపాధిగా అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ, పోలీస్ ఉద్యోగాలు కూడా చాలామందికి రావడం జరిగిందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ–పిఎం కిసాన్ ద్వారా 10సెంట్లు పైబడి ఉన్న రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రైతులకు పెట్టుబడి ఆర్థిక సాయంగా ప్రతి సంవత్సరం రూ.20 వేలు అందజేయడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా మొదటి విడత ఖరీఫ్ సాగుకు రూ.7వేలు (అన్నదాత సుఖీభవ రూ.5వేలు, పిఎం కిసాన్ రూ.2వేలు) అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న 2,06,052 మంది రైతాంగానికి రూ.140.57 కోట్లు అన్నదాత సుఖీభవ–పిఎం కిసాన్ పథకాల ద్వారా నగదు విడుదల చేయడం జరిగిందన్నారు. లిఅన్నదాత సుఖీభవ–పిఎం కిసాన్ ద్వారా లబ్ధి పడని లబ్ధిదారులు కంగారు పడకుండా సచివాలయంలో దరఖాస్తులు ఇచ్చినట్లయితే వాటిని స్వీకరించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు పొందాలంటే ప్రతి రైతు ఈకెవైసి తప్పక చేయించుకొని ఉండాలన్నారు. అదేవిధంగా ఎన్పీసీఐ పోర్టల్ లో రైతుల బ్యాంకు ఖాతాకు ఆధార్ ట్యాగ్ అయ్యేలా చూసుకోవాలన్నారు. అనంతరం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలకు సంబంధించి 206052 మంది రైతులకు రూ.140.57 కోట్ల మెగా చెక్కును మంత్రి, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రైతులకు అందజేశారు.

# రాత్రుళ్లు అన్నం బదులుగా చపాతీలు తింటున్నారా.?



మనగళం, ఈ మధ్యకాలంలో చాలామంది యువతకు ఊబకాయం పెద్ద తలనొప్పిగా మారింది. దానికోసం తమ బరువును కంట్రోల్ చేయాలని శతవిధాల తాపత్రయపడుతుంటారు. అందుకోసం రాత్రిపూట అన్నం మానేసి మరీ చపాతీలు తినడం మొదలుపెడుతుంటారు.అయితే ఇలా ఉన్నఫలంగా వైట్ రైస్ బదులు రాత్రుళ్లు చపాతీలు తినడం ఆరోగ్యానికి అంత మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గాలనే క్రమంలో ఒక పూట పూర్తిగా రైస్ మానేసేకంటే.. అన్నం తక్కువ తిని.. చపాతీలు ఎక్కువ తీసుకోవడం బెటర్ అని డాక్టర్ల సూచన. అలాగే రాత్రుళ్లు వేడివేడి చపాతీలు తినే బదులు నిల్వ ఉన్న చపాతీలు తినడం ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తుందన్నారు డాక్టర్లు. అప్పుడే వేడిగా వచ్చే చపాతీల్లో నూనె కంటెంట్ ఎక్కువ ఉంటుందని.. అలా కాకుండా నిల్వ ఉండే చపాతీలు, రోటీల్లో పోషకాలు ఎక్కువ ఉండటం వల్ల.. అవి తింటే బ్లడ్ ప్రెషర్, అల్సర్స్, గ్యాస్ వంటి కడుపు సంబంధిత రోగాలు తగ్గిపోతాయన్నది వైద్యుల వాదన. అలాగే రక్తహీనతతో బాధపడుతున్నవారు కూడా చపాతీలు తింటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందొచ్చునని అంటున్నారు. కాగా, మీరు ఏదైనా డైట్ ఫాలో అయ్యే ముందు కచ్చితంగా మీ డాక్టర్‌ను సంప్రదించండి.. పై వార్త కేవలం పలు అధ్యయనాలు ఆధారంగా ప్రచురితం చేసింది మాత్రమే.

# గురక వేధిస్తుందా.?

మనగళం, గురక.. చాలా మందిని వేధించే సాధారణ సమస్య. చాలా మంది ఈ సమస్యను ఎదుర్కొనే ఉంటారు. గురక సాధారణంగానే భావించినా ఇతర అనారోగ్య సమస్యలకు సైతం దారి తీస్తుందని వైద్యులు చెబుతూనే ఉన్నారు.ఈ క్రమంలోనే తాజాగా గురక మూర్ఛకు దారి తీస్తుందని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా మూర్ఛ అనేది పుట్టుకతోనే వస్తుంది. అయితే గురక ఉన్న వారికి కూడా భవిష్యత్తులో మూర్ఛ వచ్చే అవకాశాలు ఉంటాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది.మూర్ఛ రావడానికి పక్షవాతం, అధిక రక్తపోటు, మెదడులో కణితి వంటి రకరకాల అంశాలతో పాటు గురక కూడా ఒక కారణమని పరిశోధకులు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా 60 ఏళ్ల తర్వాత మూర్ఛ రావడానికి కారణమని అంటున్నారు. నిద్ర పోతున్నప్పుడు కాసేపు శ్వాస ఆడకపోవటం (స్లీప్ అప్నియా), రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గటానికీ సంబంధం ఉంటున్నట్టు తేలింది.కొందరిలో నిద్రపోతున్న సమయంలో గొంతు వెనకాల భాగం వదులై శ్వాస మార్గానికి అడ్డుతగులుతుంది. ఈ కారణంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తుతుంది. రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గడంతో ఉక్కిరిబిక్కిరై బిగ్గరగా గురక పెడుతూ తిరిగి శ్వాస తీసుకుంటుంటారు. ఇదంతా మనకు తెలియకుండానే జరుగుతుంది. ఈ ప్రక్రియ పలు రకాల సమస్యలకు దారి తీస్తుంది. అందులో వృద్ధాప్యంలో మూర్ఛ రావడం కూడా ఒకటని నిపుణులు చెబుతున్నారు. నిద్రపోతున్న సమయంలో శ్వాసలో ఇబ్బందులు తలెత్తే వారికి మూర్ఛ వచ్చే అవకావాలు రెండింతలు పెరిగే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. దీర్ఘకాలంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడడం, ఆక్సిజన్ శాతం తగ్గడంతో మెదడులో మార్పులు తలెత్తే అవకాశముందని, మూర్ఛ రావడానికి ఇదే కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అందుకే గురక సమస్య వేధిస్తుంటే అందుకు సంబంధించి జాగ్రత్త పడాలని సూచిస్తున్నాం



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# అతన్నే పెళ్లి చేసుకుంటా.. అనుష్క శెట్టి క్లారిటీ



మన గళం,సినిమా : 20 ఏళ్లుగా దక్షిణాది సినీ పరిశ్రమలో తనదైన స్థానాన్ని సంపాదించుకున్న అగ్రహీరోయిన్ అనుష్క శెట్టి ఇప్పటికీ టాప్ లీగ్‌లో కొనసాగుతోంది. అనుష్క తర్వాత ఇండస్ట్రీలోకి వచ్చిన చాలా మంది హీరోయిన్‌లు ఇప్పటికే పెళ్లి చేసుకుని కుటుంబ జీవితంలోకి అడుగుపెట్టినప్పటికీ, స్వీటి మాత్రం తనకు నచ్చిన దారిలో సాగుతూ కెరీర్‌ను కొనసాగిస్తోంది. 2005లో నాగార్జున హీరోగా నటించిన 'సూపర్' సినిమా ద్వారా వెండితెరపై అరంగేట్రం చేసిన అనుష్క, తన అందంతో, అభినయంతో తక్కువ సమయంలోనే ప్రేక్షకులను ఆకట్టుకుంది. క్లాస్, మాస్ తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయింది. స్టార్ హీరోలందరితో కలిసి హిట్టైన సినిమాలు చేసింది. 'బాహుబలి' అనంతరం ఆమెకు పాన్-ఇండియా క్రేజ్ వచ్చింది. అదే సమయంలో సహనటుడు ప్రభాస్‌తో అనుష్క డేటింగ్‌లో ఉన్నారనే పుకార్లు మొదలయ్యాయి. వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని ఎన్నోసార్లు వార్తలు వచ్చాయి. కానీ ఈ విషయాలను అనుష్క, ప్రభాస్ ఇద్దరూ ఖండించారు. ఆ తరువాత ఓ ప్రముఖ వ్యాపారవేత్తతో కూడా అనుష్క పెళ్లి వార్తలు చక్కర్లు కొట్టాయి. అవి కూడా చివరికి వదంతులేనని తేలిపోయాయి. తాజా ఇంటర్వ్యూలో పెళ్లిపై క్లారిటీ ఇచ్చింది అనుష్క. ఈ అమ్మడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ%ొ% బాహుబలి విడుదలైన తర్వాత నాపై పెళ్లి ఒత్తిడి ఎక్కువైంది. కుటుంబ సభ్యులే కాదు, మీడియా నుంచి కూడా ఇదే ప్రశ్న వస్తోంది. నాకు పెళ్లిపై పూర్తి నమ్మకం ఉంది. సరైన వ్యక్తి, సరైన సమయం వచ్చినప్పుడు తప్పకుండా పెళ్లి చేసుకుంటా. ప్రేమ లేకుండా పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదు. నేను ప్రేమించే వ్యక్తినే వివాహం చేసుకుంటాను. నా తల్లిదండ్రులు ఈ విషయంలో నాకు మద్దతుగా ఉన్నారు అని చెప్పింది. సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తిని మాత్రం పెళ్లి చేసుకోను అని అనుష్క తేల్చి చెప్పడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దీంతో ఆమె భవిష్యత్తు జీవిత భాగస్వామి ఇండస్ట్రీ వ్యక్తి కాదనే క్లారిటీ వచ్చింది. కాగా, రవి తేజ, నాగార్జున, ప్రభాస్ వంటి స్టార్ హీరోలతో ఎన్నో హిట్ సినిమాలు చేసిన అనుష్క, ఇటీవల సినిమాలకు కాస్త బ్రేక్ తీసుకుంది. ఈ విరామం ఆమె వ్యక్తిగత జీవితంపై ఊహాగానాలకు దారితీసింది. ప్రస్తుతం ఆమె నటించిన 'ఘాటి' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన ఈ చిత్రంపై మంచి అంచనాలున్నాయి. విడుదల తేదీపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు.



# ఉత్తమ చిత్రంగా భగవంత్ కేసరి

మన గళం,సినిమా : కేంద్ర ప్రభుత్వం 71 వ నేషనల్ ఫిల్మ్ అవార్డులను ప్రకటించింది. ఉత్తమ చిత్రంగా భగవంత్ కేసరి జాతీయ అవార్డును అందుకుంది. నందమూరి బాలకృష్ణ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో శ్రీలీల కీలక పాత్రలో నటించగా.. కాజల్ హీరోయిన్ గా నటించింది. 2023 లో రిలీజ్ అయినా ఈ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. షైన్ స్క్రీన్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించిన ఈ సినిమా ఎన్నో అవార్డులను అందుకుంది. నేలకొండ భగవంత్ కేసరిగా బాలయ్య నటనకు ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. ముఖ్యంగా ఈ సినిమాలో చూపించిన గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ అనే పాయింట్ ప్రతి ఒక్క తల్లిదండ్రులకు ఒక గుణపాఠం గా చూపించింది. ఇక ఈ విషయం తెలియడంతో నందమూరి ఫ్యాన్స్ సంబురాలు మొదలుపెట్టారు. ఈ ఏడాదిలోనే బాలయ్యకు పద్మభూషణ్ వరించింది. ఆ ఆనందంలో ఉన్నప్పుడే మరో జాతీయ అవార్డును ఆయన సినిమాకు రావడం హర్షించదగ్గ విషయమని నెటిజన్స్ కామెంట్స్ పెడుతున్నారు.




# విజేతలకు పవన్ అభినందనలు

మన గళం,సినిమా : జాతీయ చలన చిత్ర పురస్కార గ్రహీతలకు ప్రముఖ నటుడు, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభినందనలు తెలిపారు. ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ, '71వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో తెలుగు సినిమా రంగానికి పలు పురస్కారాలు దక్కడం సంతోషంగా ఉంది. సోదరుడు, హిందూపురం ఎమ్మెల్యే శ్రీ నందమూరి బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి' ఉత్తమ తెలుగు చిత్రం పురస్కారానికి ఎంపిక కావడం ఆనందదాయకం. ఆ చిత్ర దర్శకుడు శ్రీ అనిల్ రావిపూడి, నిర్మాతలు శ్రీ సాహు గారపాటి, శ్రీ హరీష్ పెద్దిలకు అభినందనలు. ఉత్తమ వి.ఎఫ్.ఎక్స్. చిత్రంగా 'హను-మాన్' చిత్రం నిలిచింది. ఈ చిత్ర దర్శకుడు శ్రీ ప్రశాంత్ వర్మ, వి.ఎఫ్.ఎక్స్. నిపుణులకు, నిర్మాతకు అభినందనలు. ఉత్తమ స్క్రీన్ ప్లే రచయితగా శ్రీ నీలం సాయి రాజేష్ (బేబీ చిత్రం), ఉత్తమ గీత రచయితగా శ్రీ కాసర్ల శ్యామ్ (బలగం), ఉత్తమ గాయకుడుగా శ్రీ పి.వి.ఎన్.ఎస్. రోహిత్ (బేబీ), ఉత్తమ స్టంట్ కొరియోగ్రాఫర్ గా శ్రీ నందు పృథ్వీ (హను-మాన్), ఉత్తమ బాల నటిగా సుకృతివేణి బండ్రెడ్డి (గాంధీ తాత చెట్టు) పురస్కారాలకు ఎంపికైనందుకు వారికి హృదయపూర్వక అభినందనలు. ఈ పురస్కారాలు చిత్ర పరిశ్రమకు నూతనోత్సాహాన్ని అందిస్తాయి. జాతీయ ఉత్తమ నటులుగా శ్రీ షారుక్ ఖాన్, శ్రీ విక్రాంత్ మాస్సే, ఉత్తమనటిగా శ్రీమతి రాణీ ముఖర్జీ, ఉత్తమ దర్శకుడుగా శ్రీ సుదీప్తో సేన్, ఇతర పురస్కార విజేతలకు అభినందనలు' అని తెలిపారు.





# కింగ్డమ్ సినిమా చూసిన రష్మిక..






మన గళం,సినిమా : ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న సినిమా కింగ్డమ్. విజయ్ దేవరకొండ హీరోగా డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన ఈ చిత్రానికి ఊహించని స్థాయిలో రెస్పాన్స్ వస్తుంది. ముఖ్యంగా మాస్ యాక్షన్ హీరోగా విజయ్ యాక్టింగ్ అదరగొట్టాడని%ొ% సత్యదేవ్, విజయ్ మధ్య వచ్చే సీన్స్ గూస్ బంప్స్ అంటున్నారు ఫ్యాన్స్. ఇక ఈ సినిమాకు మరో హైలెట్ బీజీఎమ్. కథకు తగినట్లు అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ ఇరగదీశాడ ఇక గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్ అదిరిందంటూ కామెంట్స్ చేస్తున్నారు. టీజర్, ట్రైలర్ తో హైప్ క్రియేట్ చేసిన ఈ సినిమా విజయ్ కెరీర్ లోనే భారీ ఓపెనింగ్స్ సాధించి అదరగొట్టింది. అయితే కింగ్డమ్ సినిమా విడుదల సమయంలో నేషనల్ క్రష్ రష్మిక మందన్నా విజయ్ కు ఆల్ ది బెస్ట్ చెబుతూ ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే. అలాగే సినిమా సూపర్ హిట్ టాక్ రావడంపై సైతం స్పందించింది. మొదటి నుంచి ఈ సినిమా కోసం ఎగ్జైటెడ్ గా ఉన్న రష్మిక.. అభిమానులతో కలిసి సినిమా చూడాలని అనుకుందట. హైదరాబాద్ ఫేమస్ సింగిల్ స్క్రీన్ లో ఆమె ఈ సినిమాను చూడాలనుకుందట. ముందుగా శ్రీరాములు థియేటర్ లో ఆమె ప్లాన్ చేసుకోగా.. సెక్యూరిటీ కారణాలతో ఆమె సినిమా చూసేందుకు నిర్వాహకులు ఒప్పుకోలేదట. దీంతో మరో సింగిల్ స్క్రీన్ థియేటర్ భ్రమరాంబ లో ఈ సినిమాను చూసిందట. అయితే చిత్రాన్ని నేరుగా కాకుండా మారువేశంలో వెళ్లి చూశారట. ఈ విషయాన్ని తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో నిర్మాత నాగవంశీ బయటపెట్టారు. ఇప్పుడు విషయం తెలియడంతో విజయ్, రష్మిక ఫ్యాన్స్ సర్ ప్రైజ్ గా ఫీల్ అవుతున్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



## తెలుగు షట్లర్ తరుణ్ సంచలనం

మన గళం, మకావు ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో తెలుగు షట్లర్ తరుణ్ మన్నేపల్లి సంచలనం సృష్టించాడు. టాప్‌సీడ్ లీ చుక్ యుకి షాక్ ఇచ్చి క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకు పోయాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో రెండో రౌండ్‌లో తరుణ్ 19-21, 21-14, 22-20తో వరల్డ్ నెం. 15 లీ (హాంకాంగ్)పై విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో లక్ష్యసేన్ 21-14, 14-21, 21-17 వార్డోయోపై నెగ్గి క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ జంట 10-21, 22-20, 21-16తో కుమగాయ్/నిషి (జపాన్) జోడీపై గెలుపొంది రౌండ్-8కి చేరింది. అలాగే సాయిప్రతీక్ /కృష్ణమూర్తి రాయ్ జంట 21-18, 21-18తో జునైద్/రాయ్ కింగ్ (మలేసియా) ద్వయంపై నెగ్గి క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించింది. ఆయుష్ షెట్టి 18-21, 16-21తో జస్టిన్ హెూ (మలేసియా) చేతిలో ఓడాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఐదో సీడ్ భారత ద్వయం ధ్రువ్ కపిల/తనీషా క్రాస్టో 21-19, 13-21, 18-21తో మలేసియా జోడీ జిమ్మీ వాంగ్/లీ నీ జింగ్ చేతిలో పరాజయంతో టోర్నీ నుంచి నిష్క్రమించింది.



## నాలుగు వేదికల్లో ప్రో కబడ్డీ లీగ్ ఏడేండ్ల తర్వాత వైజాగ్ ఆతిథ్యం

మన గళం, : ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్ షెడ్యూల్ వచ్చేసింది. ఆగస్టు 29 నుంచి అక్టోబర్ 23 దాకా (లీగ్ దశ) జరుగబోయే ఈ మెగా ఈవెంట్ దేశవ్యాప్తంగా నాలుగు నగరాల్లో అభిమానులకు కబడ్డీ మజాను అందించనుంది. ఈ మేరకు పీకేఎల్ నిర్వాహకులు షెడ్యూల్‌ను విడుదల చేశారు. విశాఖపట్నం, జైపూర్, చెన్నై, ఢిల్లీ వేదికలుగా ఈ టోర్నీ జరుగనుంది. ఏడేండ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ టోర్నీకి వైజాగ్ ఆతిథ్యమివ్వనుంది. వైజాగ్‌లో ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 11 వరకు, జైపూర్‌లో సెప్టెంబర్ 12 నుంచి 28 దాకా, చెన్నైలో సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 12 వరకు జరుగనున్న ఈ టోర్నీ.. ఢిల్లీలో అక్టోబర్ 13 నుంచి 23 దాకా జరుగుతుంది. ప్లేఆఫ్స్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలో వెల్లడించనున్నారు. ఇక ఆగస్టు 29న తెలుగు టైటాన్స్.. తమిళ్ తలైవాస్‌తో టోర్నీ అధికారికంగా ప్రారంభమవనుంది. డిఫెండింగ్ చాంపియన్స్ హర్యానా స్టీలర్స్.. ఆగస్టు 31న బెంగాల్ వారియర్స్ మ్యాచ్‌తో టైటిల్ వేటను మొదలుపెట్టనున్నారు.




## రెగెట్టా పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

మన గళం, యాచ్‌క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన టీసాన్ యూత్ ఓపెన్ రెగెట్టా పోటీల్లో బీసీ గురుకుల సొసైటీకి చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. జాతీయ స్థాయిలో నిలిచిన విద్యార్థి అక్షర, ఆప్టిమిస్ట్ మెయిన్ ఫ్లీట్ విభాగంలో శిరీష, హనుమంతు వెండి, కాంస్య పతకాలను సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్యదర్శి శ్రీధర్, గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు, సంయుక్త కార్యదర్శి తిరుపతి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.



## స్వియాటెక్ ముందంజ

మన గళం, ఇటీవలే ముగిసిన వింబుల్డన్‌లో మహిళల సింగిల్స్ గెలిచిన జోష్‌లో ఉన్న పోలండ్ బామ ఇగా స్వియాటెక్.. యూఎస్ ఓపెన్‌కు ముందు జరుగుతున్న మాంట్రియాల్ ఓపెన్‌లో శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో స్వియాటెక్.. 6-3, 6-1తో హన్యు (చైనా)పై అలవోక విజయం సాధించింది. వింబుల్డన్ రన్నరప్ అనిసిమొవ, ఎమ్మా రడుకాను, బెలిందా బెన్‌కిక్, జెస్సిక పెగులా, రిబాకినా సైతం తదుపరి రౌండ్‌కు చేరారు.



## బ్యాటింగ్‌లో తడబడ్డ భారత్... తొలి రోజు ఇంగ్లండ్‌దే..!

మన గళం, ఇంగ్లండ్‌తో సిరీస్‌ను 2-2తో సమం చేయాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తూ తడబాటుకు గురైంది. టాస్ గెలిచి పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకున్న ఇంగ్లండ్ పేసర్లు కట్టడిచేయడంతో టీమ్‌ఇండియా ప్రధాన బ్యాటర్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టారు. పలుమార్లు వర్షం అంతరాయం కల్గించిన మ్యాచ్‌లో 64 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. తొలిరోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. కరుణ్ నాయర్ (98 బంతుల్లో 52 నాటౌట్, 7 ఫోర్లు) అర్ధ శతకంతో రాణించగా సాయి సుదర్శన్ (108 బంతుల్లో 38, 6 ఫోర్లు) భారత్‌ను ఆదుకున్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో గస్ అట్కిన్సన్ (2/31) జోష్ టంగ్ (2/47) తలా రెండు వికెట్లు తీయగా వోక్స్ ఒక వికెట్ తీశాడు.




ఓపెనర్లు విఫలం : ఇంగ్లండ్ ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్‌కు వచ్చిన భారత్.. తొలి సెషన్ నుంచే ఇబ్బందులు ఎదుర్కొంది. పిచ్‌పై ఉన్న పచ్చికతో పాటు మబ్బులు పట్టి ఉన్న వాతావరణాన్ని వినియోగించుకుంటూ ఇంగ్లిష్ పేసర్లు కట్టుదిట్టమైన బంతులేయడంతో భారత్‌కు పరుగుల రాక గగనమైంది. అట్కిన్సన్ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో బంతిని తప్పుగా అంచనా వేసిన జైస్వాల్ (2) వికెట్ల ముందు దొరికిపోయాడు. మూడో స్థానంలో వచ్చిన సాయితో కలిసి రాహుల్ (14).. ఆచితూచి ఆడాడు. అయితే డ్రింక్స్ విరామం తర్వాత వోక్స్ ఓవర్లో రాహుల్.. బంతిని కట్ చేయబోయి వికెట్ల మీదకు ఆడుకోవడంతో అతడి ఇన్నింగ్స్ ముగిసింది. ఈ క్రమంలో సాయితో జతకలిసిన గిల్(21)%ా% భారత ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే యత్నం చేశాడు. లంచ్ విరామానికి రెండు ఓవర్ల ముందు ఓవల్‌ను వర్షం ముంచెత్తింది. కొద్దిసేపటి తర్వాత వాన ఆగినా ఔట్‌ఫీల్డ్ తడిగా ఉండటంతో సుమారు రెండు గంటల పాటు ఆట నిలిచిపోయింది.

లేని పరుగు కోసం యత్నించి.. : విరామం తర్వాత తిరిగి ప్రారంభమైన ఆటలో భారత్‌కు అట్కిన్సన్ మరో షాకిచ్చాడు. అతడు వేసిన 28వ ఓవర్లో రెండో బంతిని గిల్ ఫార్వర్డ్ షార్ట్ లెగ్ దిశగా ఆడాడు. నాన్ ట్కాస్టెకర్ ఎండ్‌లో సాయి వద్దని వారించినా గిల్ సింగిల్ తీసేందుకు యత్నించి దాదాపు సగం క్రీజు దాకా వచ్చి మళ్లీ వెనక్కి వెళ్లబోయాడు. కానీ అప్పటికే బంతినందుకున్న అట్కిన్సన్.. నేరుగా వికెట్లను గురిచూసి కొట్టడంతో భారత సారథి నిరాశగా వెనుదిరిగాడు. గిల్ ఔటైన తర్వాత పది బంతులకే మళ్లీ వర్షం ప్రారంభమైంది.

ఆదుకున్న కరుణ్ : టీ తర్వాత ఆట పున:ప్రారంభమవగా శార్దూల్ స్థానంలో జట్టులోకి వచ్చిన కరుణ్ నాయర్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మొదట సాయితో కలిసి ఇంగ్లండ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న అతడు.. వాషింగ్టన్ (19 నాటౌట్)తో అజేయమైన ఆరో వికెట్‌కు 51 పరుగులు జోడించాడు. క్రీజులో కుదురుకుని అర్ధ శతకం దిశగా సాగుతున్న సాయి.. టంగ్ 36వ ఓవర్లో కీపర్ స్మిత్‌కు క్యాచ్ ఇవ్వడంతో భారత్ నాలుగో వికెట్ కోల్పోయింది. భారత్ భారీ ఆశలు పెట్టుకున్న రవీంద్ర జడేజా (9) సైతం టంగ్ ఓవర్లో సాయి మాదిరిగానే కీపర్‌కు క్యాచ్ ఇవ్వడంతో భారత్ కష్టాలు రెట్టింపయ్యాయి. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న ధ్రువ్ జురెల్ (19) కూడా వారిబాటే పట్టాడు. ఈ క్రమంలో మాంచెస్టర్ సెంచరీ హీరో వాషింగ్టన్, కరుణ్.. వికెట్ల పతనానికి అడ్డుకట్ట వేసి రోజును ముగించారు.

గిల్ అరుదైన ఘనత.. : కెప్టెన్‌గా తన తొలి టెస్టు సిరీస్‌లోనే గిల్ దిగ్గజాల సరసన నిలిచాడు. ఈ సిరీస్‌లో టాప్ స్కోరర్‌గా ఉన్న భారత సారథి (743).. ఐదో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 11 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత సారథిగా నిలిచాడు. గతంలో ఈ రికార్డు సునీల్ గవాస్కర్ (1978/79లో వెస్టిండీస్‌తో 732 రన్స్) పేరిట ఉండేది. ఈ జాబితాలో విరాట్ కోహ్లీ (2016/17లో ఇంగ్లండ్ పై 655) మూడో స్థానంలో ఉన్నాడు.

సంక్షిప్త స్కోర్లు భారత్ తొలి ఇన్నింగ్స్: 64 ఓవర్లలో 204/6 (కరుణ్ 52లి, సాయి 38, అట్కిన్సన్ 2/31, టంగ్ 2/47)

## మర్చండ్ ప్రపంచ రికార్డు

మన గళం, ఒలింపిక్ చాంపియన్, ఫ్రెంచ్ స్విమ్మర్ లియోన్ మర్చండ్ ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిపలోనూ తనకు తిరుగులేదని చాటాడు. 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే ఈవెంట్‌లో మర్చండ్ ఒక నిమిషం 52.61 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకొని సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలో 2011లో అమెరికా స్విమ్మర్ ర్యాన్ లోచెట్ నమోదుచేసిన ఒక నిమిషం 54 సెకన్ల ప్రపంచ రికార్డును మర్చండ్ బద్దలుకొట్టాడు. గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో నాలుగు స్వర్ణ పతకాలు కొల్లగొట్టిన 23 ఏళ్ల మర్చండ్.. ఇంకా 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లేతో పాటు రిలే ఈవెంట్‌లో పోటీపడాల్సి ఉంది.




Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310